Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 79 మేడ్చల్ మల్కాజ్‌గిరి 11 ఏప్రిల్ 2023 మంగళవారం పేజీలు : 4

## కనిష్ఠాల నుంచి కోలుకున్నా.. నష్టాల్లోనే ముగిసిన మార్కెట్లు!

ముంబయి: అంతర్జాతీయ ప్రతికూల సంకేతాల మధ్య ఉదయం భారీ నష్టాలతో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు చివరకు కనిష్ఠాల నుంచి కోలుకున్నాయి. కానీ, లాభాల్లోకి మాత్రం రాలేకపోయాయి. మిశ్రమ కార్పొరేట్ ఫలితాలు, ఫెడ్ వడ్డీరేట్ల పెంపు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం వంటి పరిణామాలు ఇంట్రాడేలో మదుపర్లను కలవరపెట్టాయి. చైనాలో కరోనా వ్యాప్తి నేపథ్యంలో విధిస్తున్న కఠిన లాక్‌డౌన్‌లు కూడా సెంటిమెంటును దెబ్బతీశాయి. అయితే, అమెరికా ఫ్యూచర్స్ ప్రస్తుతం లాభాల్లో ట్రేడవుతుండడంతో సూచీలకు చివర్లో కాస్త మద్దతు దొరికింది. మరోవైపు గత కొన్ని రోజుల భారీ నష్టాల నేపథ్యం లో కనిష్ఠాల వద్ద మదుపర్లు కొనుగోళ్లకు ఆసక్తి చూపారు.




## 'సారు' ఏది చేసినా 'లెక్క పక్కా'

# దటీజ్ కేసీఆర్

## మోడీని 'కూల్' చేస్తే వచ్చే లాభం కన్నా... నష్టమే ఎక్కువ అని గ్రహించిన కేసీఆర్!!

హైదరాబాద్ : అందుకే.. ప్రస్తుతం ప్రధాని మోడీ హైదరాబాద్కు వచ్చినా.. కేసీఆర్ కలవలేదనే కామెంట్లు వినిపిస్తున్నాయి. ఒకవేళ.. పాత వైరాలు..(నిజానికి వ్యక్తిగత వైరం కాదు.. రాజకీయంగానే వైరం) పక్కన పెట్టి.. కేసీఆర్ వెళ్లి ఒక హగ్ ఇచ్చి.. మరో గార్లాండ్ వేస్తే.. అదిగో..నిన్నటి వరకు తిట్టి.. ఇప్పుడు చేతులు కలిపేశాడు! అనే కామెంట్లు సోషల్ మీడియాలో వరదలై... ప్రవాహాలపై.. సామాజిక మాధ్యమాన్ని ముంచెత్తుతాయి. దీనివల్ల వచ్చేది లేదు.. పోయేది తప్ప!! సో.. దీనికన్నా.. మోడీకి దూరంగా ఉండి.. ఆయనతో తిట్టించుకోవడమే బెటర్ అని కేసీఆర్ భావిస్తున్నట్టు చెబుతున్నారు పరిశీలకులు. అంతేకాదు.. ప్రధాని అంతటి వాడితో తిట్టించుకోవడం.. ఉంగరాల చేత్తో మొట్టించుకున్నంత బాధ కాదు.. ఆనందంగా ఉంటుందని అంటున్నారు.

ఇప్పుడు తిట్టుడు కావాలి. అందునా.. మోడీ అంతటి వాడు తిడితే.. మరీ మంచిది? అందుకే కేసీఆర్ దూరంగా ఉన్నారనేది ఒక వర్గం విశ్లేషకుల మాట. తెలంగాణ జాతిపితగా అప్రకటిత ప్రచారంలో ఉన్న కేసీఆర్ ను తిడితే.. తెలంగాణ సమాజం ఊరుకుంటదా! కేసీఆర్ అవినీతి పరుడని అంటే.. తెలంగాణ సమాజం ఊరుకుంటదా.. ! తెలంగాణ కోసం.. ప్రాణత్యాగానికి సైతం సిద్ధపడ్డ మహానేతను అంటే ఊరుకుంటదా..! అనేవారికి కర్రకాల్చి వాత పెట్టదా!! (ఎందుకంటే.. లిక్కర్ స్కాంలో ఈడీ విచారణకు కవిత వెళ్తే.. దానిని తెలంగాణ సమాజంపై దాడిగా పేర్కొన్నారు కదా!!) ఆవేశం.. ఆక్రోశం రగిలి.. అది ఎన్నికల ముంగిట.. ఈవీఎం పాడ్లపై.. ఓట్ల వర్షం కురిపించదా!! అప్పటి వరకు ఉన్న విఫల వ్యవహారాలు గాలికి కొట్టుకుపోయి.. చివరాఖరుకు.. ఎన్నికల ముంగిటకు.. కావాల్సిన శక్తిని అందిస్తే.. చాలదా!! ఇదీ.. కేసీఆర్ వ్యూహం అంటున్నారు పరిశీలకులు. అందుకే.. మోడీని కూల్ చేయాల్సిన అవసరం లేదు. ఆయనకు స్వాగతాలు పలకాల్సిన పనీ లేదు. పైగా.. ఇంకా చెప్పాలంటే.. మరింత తిడితే.. మహా మంచిదని మౌనంగా ఉంటే.. రేపు ఓట్ల వేటలో వీటిని వాడుకునే వీలుండదా!! సో.. దటీజ్ కేసీఆర్!!!



## బండి సంజయ్ సంచలన నిర్ణయం.. వరంగల్ సీపీకి షాక్!

హైదరాబాద్: పదో తరగతి పేపర్ లీకేజీ కేసులో తెలంగాణ బీజేపీ చీఫ్ బండి సంజయ్‌ను వరంగల్ పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అనంతరం, జరిగిన పరిణామాలతో కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే, పేపర్ లీక్ కేసులో సంజయ్.. సంచలన నిర్ణయం తీసుకున్నారు. బండి సంజయ్.. వరంగల్ సీపీ రంగనాథ్‌పై పరువునష్టం దావా వేయడానికి రెడీ అయ్యారు. టెన్త్ పేపర్ లీకేజీ విషయంలో తనపై నిరాధార ఆరోపణలు చేశారని సంజయ్ కోర్టుకు వెళ్లనున్నట్టు తెలిపారు. దీనికి సంబంధించిన నివేదికను కూడా సంజయ్ ప్రిపేర్ చేసినట్టు తెలుస్తోంది. తన హక్కుల భంగంతోపాటు ఇతర విషయాలపై పార్లమెంట్ ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేయాలని నిర్ణయించుకున్నట్లు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో తన చేసిన ఆరోపణలపై కూడా పోరాటం చేస్తానని అన్నారు. ఈ నేపథ్యంలో బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ.. వరంగల్ సీపీని వదిలిపెట్టే ప్రసక్తే లేదు. ఆయన అవినీతి చిట్టా మొత్తం బయటకు తీస్తాం. నా ఫోన్ ఇవ్వడం లేదని అంటున్నారు. ముందు సీపీ ఫోన్‌కాల్ లిస్టు బయటకు తీస్తే అసలు విషయాలు వెలుగులోకి వస్తాయి. ఈటల రాజేందర్ ఫోన్ అడిగే అధికారం మీకు ఎవరు ఇచ్చారు? అని ప్రశ్నించారు. నా ఫోన్ కేసీఆర్ దగ్గరే ఉందని అన్నారు. మీ దగ్గరే నా ఫోన్ పెట్టుకుని నన్ను ఎందుకు అడుగుతున్నారని ప్రశ్నించారు.

## బీఆర్ఎస్ బిగ్ స్కెచ్: వ్యవస్థాపక దినోత్సవం నాడు కీలక ప్రకటనలు

హైదరాబాద్: భారత్ రాష్ట్ర సమితి..ఈ నెల 27వ తేదీన ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జరుపుకోనుంది. దీనికోసం ఇప్పటి నుంచే కసరత్తు మొదలు పెట్టింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ వేడుకలను నిర్వహించనుంది. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్ తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది చివర్లో అసెంబ్లీ, వచ్చే సంవత్సరం లోక్‌సభ ఎన్నికలను ఎదుర్కొనబోతోన్న నేపథ్యంలో- ఈ ఆవిర్భావ దినోత్సవాలను బీఆర్ఎస్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఇందులో భాగంగా- ఈ నెల 25వ తేదీన నియోజకవర్గ స్థాయి పార్టీ ప్రతినిధుల సభలు జరుగనున్నాయి.

నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, ఎమ్మెల్యేలు ఈ సభలకు అధ్యక్షత వహిస్తారు. అనంతరం 27వ తేదీన బీఆర్ఎస్ సర్వసభ్య సమావేశం ఉంటుంది. 25వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని అన్ని గ్రామాలు, వార్డుల్లో ఉదయం నుంచే పార్టీ జెండాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ 27వ తేదీన పార్టీ కేంద్ర కార్యాలయంలో జెండాను ఆవిష్కరిస్తారు. అనంతరం సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పలు రాజకీయ తీర్మానాలను ప్రవేశపెట్టనున్నారాయన. విస్తృత చర్చల అనంతరం వాటిని ఆమోదిస్తారు. పార్టీ ఆవిర్భావ సభ, విస్తృత స్థాయి సమావేశాలను మాత్రం ఇప్పుడు నిర్వహించట్లేదని కేటీఆర్ తెలిపారు. దీనికి బదులుగా అక్టోబర్ 10వ తేదీన వరంగల్‌లో మహాసభను నిర్వహించనున్నట్లు చెప్పారు. కేసీఆర్ పలు కీలక నిర్ణయాలను ఈ సభలో ప్రకటిస్తారని పేర్కొన్నారు. అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో- వాటిని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయాలను వెల్లడిస్తారని వివరించారు. ఈ మహా సభను ఎన్నికల ప్రచార




సభగా మార్చే అవకాశం లేకపోలేదని పార్టీ వర్గాలు అంచనా వేస్తోన్నాయి. ఏపీలో కూడా కొన్ని నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలను జరపనున్నట్లు కేటీఆర్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఏపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్.. పార్టీ ఆవిష్కరణ కార్యక్రమాలను నిర్వహిస్తారని, ఈలోగా కేంద్ర కార్యాలయాన్ని ఖరారు చేస్తామని పేర్కొన్నారు కేటీఆర్.

# ఆక్వా హాబ్‌లో స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పిస్తాం



## సిరిసిల్లలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి కేటీఆర్

సిరిసిల్ల: మంత్రి కేటీఆర్ సిరిసిల్ల జిల్లాలో పర్యటిస్తున్నారు. తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట మండలాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. తంగళ్లపల్లి మండలంలోని చీర్లవంచలో సబ్‌స్టేషన్ ప్రారంభించారు, ఎస్సీ కమ్యూనిటీ హాల్, ముదిరాజ్ సంఘ భవన్‌కు శంకుస్థాపన చేశారు. గ్రామంలో అంబేద్కర్, చాకలి ఐలమ్మ విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి కేటీఆర్



మాట్లాడారు. 350 ఎకరాలలో ఆక్వా హబ్ ఏర్పాటు చేయనున్నామని, అందులో స్థానిక పిల్లలకే ఉద్యోగావకాశాలు కల్పిస్తామని స్పష్టం చేశారు. చీర్లవంచ నుంచి వలస పోయినవాళ్లంతా వాపస్ వస్తున్నారని చెప్పారు. గ్రామంలో జూనియర్ కాలేజీని ఏర్పాటు చేసుకుందామన్నారు. చీర్లవంచకు త్వరలో ఒక పీహెచ్‌సీని తీసుకొస్తామని, గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో టీచర్ల కొరత లేకుండా చూస్తామని వెల్లడించారు. ఇండ్లు లేని ప్రతి ఒక్కరికి ఇండ్లు ఇప్పించే బాధ్యత తనదని చెప్పారు. రోడ్ల అభివృద్ధికి రూ.10 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. గృహలక్ష్మి పథకం కింద అర్హులకు రూ.3 లక్షల సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. చీర్లవంచలో రూ.12 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. గ్రామంలో అప్పర్ ప్రైమరీ స్కూల్‌ను ఏర్పాటు చేసుకుందామని చెప్పారు. దళితులలో ఉన్న పేదరికాన్ని నిర్మూలించేందుకే దళిత బంధు కార్యక్రమం అమలుచేస్తున్నామన్నారు.

## సంపాదకీయం

# సద్దాం పాలనే బెటర్..

## గళమెత్తిన ఇరాక్ ప్రజలు

ఇరాక్. పాకిస్థాన్ దేశానికి సమీపంలో ఉన్న ముస్లిం కంట్రీ. అయితే.. ఇక్కడ సద్దాం హుస్సేన్ నియంతలా వ్యవహరిస్తున్నారని.. పేర్కొంటూ.. 2000 సంవత్సరంలో అప్పటి అమెరికా అధ్యక్షుడు జార్జ్ బుష్.. ఇరాక్పై దండెత్తారు. అంతేకాదు.. అప్పటి ఇరాక్ పాలకుడు.. సద్దాం హుస్సేన్ను చంపి.. అక్కడ అమెరికా పాలనను ప్రారంభించారు. నిజానికి అమెరికా ప్రమేయాన్ని నిలువరించడమే ఇరాక్ అధిపతిగా .. సద్దాం చేసిన ప్రయత్నం. ఈ కసితోనే కక్షగట్టిన .. అమెరికా.. సద్దాంను చంపే వరకు కూడా నిద్రపోలేదు. ఇరాక్ను హస్త గతం చేసుకోవడం ద్వారా.. చమురు నిల్వలను సొంతం చేసుకునే పన్నాగం కూడా ఉందని.. అప్పట్లో విశ్లేషణలు వచ్చాయి. అయినప్పటికీ.. అమెరికా తన పంతాన్ని నెగ్గించుకునేందుకు.. ఇరాక్ వద్ద.. అంటే.. సద్దాం వద్ద.. సామూహిక జన హనన ఆయుధాలు ఉన్నాయని.. వీటిని ప్రయోగించే అవకాశం ఉందని ఇది ప్రపంచానికి పెను సవాల్ వంటిదని పేర్కొంటూ.. ఏకపక్షంగా దాడులు చేసింది. అయితే.. యుద్ధం ముగిసింది.. బంకర్లో దాక్కున్న సద్దాంను అమెరికా సేనలు మట్టుబెట్టాయి. ఆయన శిలా విగ్రహాలను పెళ్లగించాయి. కట్ చేస్తే.. 2003లో అమెరికా అప్రకటిత పాలనలోకి ఇరాక్ వెళ్లిపోయింది. మరి అగ్రరాజ్యం కనుసన్నల్లో ఇరాక్ అభివృద్ధి చెందిందా? ఇప్పటికి 20 ఏళ్లు పూర్తయ్యాయి. మరి ఈ 20 ఏళ్లలో ఇరాక్ ఏమేరకు పుంజుకుంది? అనే ప్రశ్నలు సహజంగానే తెరమీదికి వస్తాయి. దీనిపై ఇటీవల గాలప్ ఇంటర్నేషనల్ సంస్థ ఓ సర్వే చేపట్టింది. దీనిలో అనేక మంది ఇరాక్ పౌరులు భాగస్వామ్య మయ్యారు. వీరు తమ అభిప్రాయాలను నిస్సంకోచంగా వెల్లడించారు. సద్దాం హుస్సేన్ పాలనను పడగొట్టడానికే అమెరికా దండయాత్ర చేసిందని సర్వేలో పాల్గొన్న 29 శాతం మంది పేర్కొన్నా రు. అమెరికా నేతృత్వంలో 2003 నుంచి దేశం పరిస్థితి అధ్వాన్నంగా మారిందని మెజారిటీ ప్రజలు చెప్పడం గమనార్హం. అమెరికా దండయాత్రకు ముందుతో పోలిస్తే ఇప్పటి ఇరాక్ పరిస్థితి ఎలా ఉందంటే.. 60 శాతం మంది ప్రస్తుతం దేశం పరిస్థితి బాగా దిగజారిందని చెప్పడం.. అమెరికా దుర్నీతికి నిదర్శనంగా మారింది. ఇక 2003 తర్వాత ఇరాక్లో షియా అరబ్ మెజారిటీ రాజకీయంగా శక్తిమంతంగా మారింది. ఇది సున్నీ కుర్ద్ ఇతర మైనారిటీ కమ్యూనిటీల్లో ఆగ్రహాన్ని పెంచింది. అంటే ఒకరకంగా.. రాజకీయ అస్థిరత కూడా పెరిగిందనే చెప్పాలి. సద్దాం పాలనలో జీవితం బాగుండేదని దాదాపు 54 శాతం మంది సున్నీ ముస్లింలు అభిప్రాయపడ్డారు.

**ఐఎస్ పోయి..** ఇరాక్కు అమెరికాతో పాటు మిత్ర దేశాల నుంచి భారీ మిలటరీ సహాయం అందడంతో 2018లో ఐఎస్ను దేశం నుంచి తరిమికొట్టారు. అప్పటి నుంచి దేశంలో స్థిరత్వం తిరిగొచ్చింది. 2007లో ఇరాక్లో అమెరికా సైనికుల సంఖ్య అత్యధికంగా 170000గా ఉండేది. ఇప్పుడు వారి సంఖ్య దాదాపుగా 2500గా ఉంది.

**యువత పరిస్థితి దారుణం?** ఇరాక్లో యువత భవిష్యత్ అంధకారంలో ఉందని తెలుస్తోంది. 2019లో బాగ్దాద్ వీధుల్లో ప్రారంభమైన అక్టోబర్ సోషల్ ఉద్యమాన్ని అణిచివేశారు. ఇక దేశం వదిలిపోవాలనే ప్రయత్నాల్లోనూ ప్రజలు ఉండడం గమనార్హం. 25 శాతం మంది ప్రజలు దేశంలో ఉండడానికి ఇష్టపడడం లేదు. అయితే 47 శాతం మంది ప్రజలు మాత్రం.. ఇక్కడే ఉండి దేశాన్ని పునర్నిర్మించాలని భావిస్తున్నారు.




# ఈసారి ముందుగానే!

రంగారెడ్డి :రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. వ్యవసాయానికి అండగా నిలిచేందుకు వచ్చే వానాకాలం పంట రుణాల పరిమితిని పెంచాలని నిర్ణయించింది. అంతేకాకుండా గతంలో మే నెలలో రుణపరిమితి ప్రకటించేవారు. ఈసారి మాత్రం ముందుగానే దీన్ని ప్రకటించడంతో రైతులకు కొంత ప్రయోజనం కలిగే అవకాశం ఉంది. పెరుగుతున్న పెట్టుబడి వ్యయాలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. వచ్చే వానాకాలం సీజన్ ఆరంభానికి ముందుగానే ప్రభుత్వం రైతులకు ఊరట కలిగించే నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది వానాకాలంలో ఇచ్చే పంటలకు రుణపరిమితి (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్) పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంతేకాకుండా గతంలో కంటే భిన్నంగా ఏప్రిల్ మాసంలోనే ఆయా పంటలకు సంబంధించిన రుణపరిమితిని ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ మేరకు అన్ని జిల్లాల్లో వ్యవసాయ పంట రుణాలకు సంబంధించిన రుణపరిమితి పెంచుతూ అధికారులు నిర్ణయాలు తీసుకున్నారు. ఏఏ పంటకు ఎంతెంత పంటరుణం ఇవ్వాలనేదానిపై బ్యాంకులకు ఆదేశాలు జారీ చేశారు. వచ్చే వ్యవసాయ సీజన్కు సంబంధించి ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రధాన పంటలకు రుణపరిమితి పెంచారు. పత్తి, వరి, జొన్న, మొక్కజొన్న, సోయాబీన్, మిర్చి, పొద్దుతిరుగుడు తదితర పంటలకు రుణపరిమితి పెంచారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ (టెస్కాబ్) 120రకాల పంటలకు సంబంధించి రుణపరిమితి ఖరారు చేసింది. వివిధ రకాల పంటల సాగు ఖర్చు, ఉత్పాదకత, నీటి వసతి, ఆదాయం ఆధారంగా రుణ నిర్ధారణ చేసింది. రుణపరిమితి నివేదికను రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్ఎల్బీసీ)కి పంపించింది. తాము ఖరారు చేసినట్లుగా రైతులకు పంట రుణాలు ఇవ్వాలని సూచించింది. ఇదిలాఉంటే జిల్లావ్యాప్తంగా వానాకాలం సీజన్లో దాదాపు 2లక్షల హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో అధికంగా పత్తి, మొక్కజొన్న, వరి, కంది, జొన్న పంటలు సాగు చేస్తున్నారు. వాస్తవానికి వ్యవసాయ పంట రుణపరిమితి ప్రతిఏటా పెంచుతుంటారు. అయితే స్థానిక వ్యవసాయ పరిస్థితులకు అనుగుణంగా వీటిని జిల్లాలవారీగా ప్రకటిస్తారు. దీంతో జిల్లాకు మరో జిల్లాకు వ్యవసాయ పంటరుణాల పరిమితి లెక్కల్లో కొంత తేడా ఉంటుంది. అయితే గతంలో మే నెలలో రుణపరిమితి ప్రకటించేవారు. ఈసారి మాత్రం ముందుగానే దీన్ని ప్రకటించడంతో రైతులకు కొంత ప్రయోజనం కలిగే అవకాశం ఉంది. అయితే దీన్ని అమలు చేయాల్సిన బ్యాంకులు ఏ మేర రైతులకు సహకరిస్తాయో అనేది వేచి చూడాలి. వాస్తవానికి వ్యవసాయ రుణపరిమితిని ప్రభుత్వం పెంచినప్పటికీ ఆ మేర రుణాలు బ్యాంకులు రైతులకు ఇవ్వడం లేదు. రుణాలు ఇచ్చే విషయంలో బ్యాంకులు రైతాంగాన్ని అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఇలాంటి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకునే రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పంటసాయం కింద ప్రతిఏటా రెండు విడతలుగా రైతుకు ఆర్థికసాయం ప్రకటించింది. అయితే ఈ మొత్తం విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు ఉపయోగపడుతోంది. మిగతా వ్యవసాయ ఖర్చులకు రైతుకు మరింత రుణం అవసరముంటుంది. నిర్దేశించిన వ్యవసాయ రుణపరిమితి ప్రకారం బ్యాంకులు రైతులకు రుణాలు ఇస్తే రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. అయితే బడా బాబులకు ఉదారంగా రుణాలు ఇచ్చే బ్యాంకులు.. రైతులను మాత్రం రుణాలు ఇచ్చే సమయంలో అనేక ఇబ్బందులు పెడుతుంటాయి. ఈఏడాది ఆయా పంటలకు రుణపరిమితి పెంచిన ప్రభుత్వం రైతులకు బ్యాంకుల ద్వారా సకాలంలో రుణాలు ఇప్పించగలిగితే వారికి ఎంతో ప్రయోజనం ఉంటుంది. వాస్తవానికి ఎన్నికల ముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగానికి అనేక రాయితీలు ప్రకటించాయి. ఇందులోభాగంగా పంట రుణాలే కాకుండా రైతుకు నేరుగా ఆర్థిక సహాయం కూడా అందిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు పథకం కింద ఏటా ఎకరాకు రూ. 10వేల చొప్పున అందిస్తోంది. ఖరీఫ్ సీజన్లో రూ. 5వేలు, రబీ సీజన్లో రూ. 5వేల చొప్పున నేరుగా రైతుఖాతాలో జమ చేస్తోంది. అలాగే కేంద్రం కూడా ఎకరా నుంచి 5 ఎకరాలలోపు ఉన్నవారికి రూ. 6వేలు అందిస్తోంది. బ్యాంకర్లు సహకరిస్తేనే..విత్తన, ఎరువుల ధరలు పెరగడంతో అన్నదాతలకు పెట్టుబడి ప్రతి ఏటా పెరుగుతోంది. అలాగే వ్యవసాయ కూలీల ధరలు పెరుగుతున్నాయి. దీంతో ప్రతిఏటా రైతుకు అదనపు భారం పడుతోంది.

బ్యాంకులు రుణాలు ఇవ్వకపోవడంతో చేతిలో డబ్బులేక చిన్న, సన్నకారు రైతులు ఆందోళన చెందుతున్నారు. బ్యాంకుల నుంచి రుణాలు రాకపోవడంతో గత్యంతరం లేక రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. వాస్తవానికి నిబంధనల మేర ఖరీఫకు ఆరంభానికి ముందుగానే బ్యాంకర్లు పంటరుణాలు అందిస్తే రైతులు సాఫీగా వ్యవసాయం చేసుకోగలుగుతారు. కానీ సకాలంలో రైతులకు రుణాలు ఇవ్వాలని నాబార్డు ఇచ్చిన ఆదేశాలు కూడా ఎక్కడా అమలు కావడం లేదు. డీసీసీబీ (జిల్లా కేంద్రసహకార బ్యాంకు) కూడా వీటిని అమలు చేయడం లేదు. బ్యాంకర్లు లక్ష్యాల మేర రైతులకు రుణాలు ఇవ్వలేదు. ప్రతిఏటా చిన్న, సన్నకారు రైతులు పంటరుణాల కోసం బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయితే బ్యాంకులు కూడా నిబంధనల మేర రైతులకు సకాలంలో పంట రుణాలు ఇస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.

# అంగన్ 'వేడి'

రంగారెడ్డి :జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల్లో సరైన సౌకర్యాలు లేక చిన్నారులు విలవిల్లాడుతున్నారు. భానుడు భగభగ మండుతుంటే ఇరుకైన అంగన్వాడీ సెంటర్లలో అవస్థలు పడుతున్నారు. ఫ్యాన్లు లేక ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పక్కా భవనాలు లేక అనేక కేంద్రాలు అద్దె రూముల్లో కొనసాగుతున్నాయి. కరెంటు, మరుగుదొడ్ల సౌకర్యం లేక టీచర్లు, పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. చోటులేక ఆరుబయటే ఇమ్యూనైజేషన్, పౌష్టికాహారం అందిస్తున్నారు. పాపం... పసివాళ్లు... చిన్నగా ఎండ తగిలినా... బలమైన గాలివీచినా ఓర్చుకోలేరు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో చిన్నారులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపించేందుకు తల్లిదండ్రులు వెనుకంజ వేస్తున్నారు. ఇవన్నీ కష్టాలు దాటుకుని చిన్నారులు కేంద్రాలకు చేరుకుంటే.. అక్కడ సమస్యలు వారిని సతమతం చేస్తున్నాయి. అంగన్వాడీ కేంద్రాల్లో ఫ్యాన్లు లేక ఉక్కపోతకు పిల్లలు చెమటలు కక్కుతున్నారు. వెలుతురు కూడా సరిగా లేక చీకటి గదుల్లోనే అంగన్వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. అంగన్వాడీ కేంద్రాలు ఎండదెబ్బ తగిలి చిన్నారుల సంఖ్య తగ్గుతోంది. ఉదయం 10గంటలకే భానుడు భగభగమంటుండటంతో చిన్నారులు బయటకు రాలేకపోతున్నారు. మూడు నుంచి నాలుగేళ్ల చిన్నారులపై ఎండ ప్రభావం తీవ్రంగా పడుతోంది. ఎండల కారణంగా అంగన్వాడీ టీచర్లు కూడా ఉక్కపోత భరించలేక పోతున్నారు. జిల్లాలో 1600 అంగన్వాడీ కేంద్రాలు ఉండగా 715 కేంద్రాలు సొంత భవనాల్లో కొనసాగుతున్నాయి. 318 కేంద్రాలు అద్దె భవనాల్లోనే నెట్టుకొస్తున్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పరిధిలోని భవనాల్లో 567 కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఎక్కడ కూడా విద్యుత్ కనెక్షన్, ఫ్యాన్లు ఉన్న దాఖలాలు లేవు. అలాగే కేంద్రాల్లో మరుగుదొడ్లు కూడా కనిపించడం లేదు. అంగన్వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను ఇటీవల జరిగిన జడ్పీ సమావేశంలో సభ్యులు ప్రస్తావించారు. చిన్నారులకు ఆట, పాటలతో పాటు విద్యాబోధన అందించాల్సి ఉంటుంది. కానీ.. కేంద్రాల్లో వసతులు కొరవడటంతో చిన్నారుల పరిస్థితి అధ్వానంగా మారింది. అద్దెభవనాల్లో అవస్థలుస్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సమగ్ర శిశు అభివృద్ధి పథకం (ఐసీడీఎస్) ద్వారా అంగన్వాడీ కేంద్రాల నిర్వహణకు ఏటా ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుంది. అయినా అద్దెభవనాలు, ఇరుకు గదుల్లోనూ టీచర్లు, చిన్నారులు, లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. నిధుల కొరత కారణంగా పలు అంగన్వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు మంజూరు కావడం లేదు. తక్కువ అద్దె ఇస్తుండటంతో ఇరుకు గదుల్లో ఇబ్బంది పడాల్సి వస్తుంది. ప్రభుత్వం ఒక్కో కేంద్రానికి నెలకు రూ. 760 చొప్పున అద్దె చెల్లిస్తోంది. కనీసం సింగిల్ బెడ్ రూం ఉన్న ఇల్లుకు రూ. 5 వేల నుంచి రూ. 6 వేల వరకు అద్దె ఉంటుంది. ప్రభుత్వం ఇస్తున్న అద్దె ఏ మూలకు సరిపోవడం లేదు. అంగన్వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించాలని 60 కేంద్రాలకు స్థలాలను గుర్తించారు. కానీ.. ఇప్పటివరకు ఒక్క భవన నిర్మాణానికీ నిధులు మంజూరు కాలేదని తెలుస్తోంది.

వేసవి సెలవులు ఉండవా?రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. 42 డిగ్రీలకు తక్కువ కాకుండా ఎండ వేడిమి ఉంటుంది. ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజలు బయటకి వెళ్లొద్దని వైద్య నిపుణులు సైతం హెచ్చరికలు చేస్తున్నారు. ఇంత భారీ ఎండలు ఉన్నప్పటికీ ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలను రెండు పూటలా నడిపించడం ఏమిటని చిన్నారుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అంగన్వాడీ కేంద్రాలను ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు ఒక్కపూట నడిపించేలా ఉత్తర్వులు జారీ చేయాలని పలువురు అంగన్వాడీ కార్యకర్తలు కోరుతున్నారు.

చెట్ల కింద సమావేశాలుజిల్లాలో 27 మండలాలు, 5 రెవెన్యూ డివిజన్లలో ఏడు ఐసీడీఎస్ ప్రాజెక్టుల కింద 1,600 సెంటర్లు కొనసాగుతున్నాయి. 1,584 మంది అంగన్వాడీ టీచర్లు, 1,309 మంది ఆయాలు పని చేస్తున్నారు. ప్రతినెలా ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మీటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ టీచర్లు ఒకేసారి పెద్దసంఖ్యలో సమావేశానికి హాజరవుతున్నారు. దీంతో ప్రాజెక్టు పరిధిలో సమావేశాన్ని నిర్వహించుకునేందుకు మీటింగ్హాల్ లేకపోవడంతో చెట్ల కింద మీటింగ్ పెట్టుకుంటున్నారు. జిల్లాలోని అన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఈ సమస్య కనిపిస్తుంది. గాలి వర్షం వస్తే ఎంపీడీవో కార్యాలయంలోని మీటింగ్ హాల్లో సమావేశం కొనసాగిస్తున్నారు. జిల్లాలోని ఏడు ప్రాజెక్టుల పరిధిలో మీటింగ్హాల్స్కు భవనాలు మంజూరు చేయాలని కోరుతున్నారు.

మరుగుదొడ్లు కరువుఅంగన్వాడీ కేంద్రాలకు వస్తున్న చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు కనీసం బాత్రూం సౌకర్యం కూడా లేకపోవడంతో నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంటి నుంచి కేంద్రానికి వచ్చిన బాలింతులు, గర్భిణులు మళ్లీ ఇంటికి నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తుంది. పిల్లల ఆలనాపాలన చూస్తున్న అంగన్వాడీ టీచర్లు కూడా మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని ఎవరికి చెప్పుకోలేక నానా అవస్థలు పడుతున్నారు. చిన్నారులు బాత్రూంకు వెళితే.. కేంద్రం బయటకు తీసుకు వచ్చి శుభ్రం చేస్తున్నారు. ఈ విషయంపై జడ్పీ సమావేశంలో మహిళా సభ్యులు ప్రస్తావించినా ప్రయోజనం లేకుండా పోయింది.

కొన్ని కేంద్రాల్లో కరెంటు, ఫ్యాన్లు లేవుకొన్ని అంగన్వాడీ కేంద్రాల్లో కరెంట్, ఫ్యాన్ సౌకర్యం లేక పోవడంతో పసి పిల్లలకు ఉక్కపోత పోయడం వాస్త వమే. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. వేసవి సెలవులు, సమయం కుదింపు విషయాన్ని ఉన్నతాధికారులు ఆలోచిస్తున్నారు. 715 కేంద్రాలు సొంత భవనాల్లో కొనసాగుతున్నాయి. వీటికి కరెంట్ సౌకర్యం లేదు. – మోతి, జిల్లా శిశుసంక్షేమశాఖ అధికారి

# సింగరేణి సూపర్ బజార్లకు గడ్డుకాలం

ఇల్లెందు : సింగరేణి యజమాన్యం కార్మిక అధికారుల కుటుంబాల కోసం సింగరేణి కాలరీస్ వ్యాప్తంగా నిత్యావసరాల సరఫరాల కోసం దుకాణాలు(సూపర్బజార్లు)ఏర్పాటు చేసింది. ఇల్లెందు, కొత్తగూడెం, మణుగూర్, బూపాలపల్లి, గోదావరిఖని, శ్రీరాంపూర్, రామకృష్ణాపుర్, మందమర్రి, బెల్లంపల్లి, గోలేటి టౌనషిపలలో నిత్యావసర వస్తువులతో పాటు గ్యాస్ కౌంటర్లను కూడా ఏర్పాటు చేసింది. వీటి పర్యవేక్షణకు సింగరేణి ఒక మేనేజింగ్ డైరెక్టర్తోపాటు మూడు రీజియన్లకు ముగ్గురు డివిజనల్ మేనేజర్లను నియమించారు. అంతేగాక సేల్స్కౌంటర్లలో 90మందికి పైగా ఉద్యోగులు సింగరేణి సూపర్బజార్లలో విధులు నిర్వహిస్తున్నారు. నిరాదరణతోనే నష్టాలుసింగరేణి వివిధ ఏరియాల్లో అనేక యూజీలు మూతపడటం, కార్మికుల సంఖ్య తగ్గిపోవడం, వేర్వేరు ప్రాంతాలకు కార్మికుల బదిలీల కారణంగా కుటుంబాలు తరలిపోవడం వంటి కారణాలతో పాటు ప్రవేట్ వ్యాపారుల ఆఫర్లు, ఫ్యాకింగ్ ఆకర్షణలు సింగరేణి సూపర్బజార్లపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయి. నిజానికి సింగరేణి సూపర్బజార్లలో నిత్యావసర సరుకుల ధరలు, కాస్మొటిక్స్ ధరలు ప్రవేట్ దుకాణాలతో పోల్చితే తక్కువగా ఉంటాయి. అయితే అన్ని రకాల సరుకులు అందుబాటులో ఉండటం లేదన్న ఆవేదన కార్మిక కుటుంబాల్లో నెలకొంది. వివిధ ఏరియాల్లో డిమాండ్ మేరకు వస్తువులు సరఫరా చేయాలని ఇండెంట్లు పంపినప్పటికీ పూర్తిస్థాయిలో సరుకులు వినియోగదారులకు అందకపోవడంతో సింగరేణి కుటుంబాలు ప్రైవేటు దుకాణాల వైపే మొగ్గుచూపుతున్నారు. అంతేగాక పెద్ద మోత్తాల్లో సరుకులు దిగుమతి చేసినా కౌంటర్లలో విక్రయాల జాప్యం వల్ల సరుకులు పుచ్చిపోవడం వంటి నష్టాలను సెల్స్మెనలపై మోపుతుండటంతో వారు మొక్కుబడిగానే వి?ధులు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇల్లెందు పట్టణంలోని జేకే కాలనీలో కార్మిక కుటుంబాలు అధికంగా నివసిస్తుంటాయి. అయినా అక్కడి సూపర్బజార్ కౌంటర్ను మూసి వేశారు. ప్రతినెల రూ10వేలనుంచి రూ. 20వేలకు మించి అమ్మకాలు జరగకపోవడం, కనీసం ఇద్దరు ఉద్యోగుల వేతనాలు కూడా చెల్లించేస్థాయిలో అమ్మకాలు లేకపోవడంతో దాన్ని మూసివేశారు. అయినా సెల్స్ కౌంటర్ తెరవాలని అటు కార్మికసంఘాలు కానీ, ఇటు కార్మికకుటుంబాలు కానీ యజమాన్యాన్ని కోరడంలేదంటే సూపర్బజార్ల పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. సింగరేణి వ్యాప్తంగా కొత్తగూడెం రీజియనలోని సూపర్బజార్లే నష్టాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ఇల్లెందు, కొత్తగూడెం, మణుగూరు ఏరియాల్లోని సూపర్బజార్ల కౌంటర్లు నష్టాల్లో కొనసాగుతుండగా కార్మిక కుటుంబాలు అధికంగా నివసించే ఏరియాల్లో మాత్రం లాభాల బాటలో సాగుతున్నాయి. వంటగ్యాస్ సరఫరాలో కీలకంనిత్యవసర వస్తువులతోపాటు వంటగ్యాసను సైతం సింగరేణి సూపర్బజార్లు అందిస్తున్నాయి. అయితే వంట గ్యాస్ ధరలు భారీగా పెరగడంతో పాటు కార్మిక కుటుంబాల్లో ఇనకంట్యాక్స్ భారం తగ్గించుకునేందుకు రెండు, మూడు నెలలకోక సిలిండర్ వినియోగిస్తున్నారు. అంతేగాక ఇల్లెందులాంటి ఏరియాల్లో గ్యాస్ డోర్డెలవరీలో వినియోగదారుల నుంచి అధికమొత్తాల్లో డబ్బు దండుకుంటున్న తీరుతో సూపర్బజార్లపై కార్మిక కుటుంబాల్లో వ్యతిరేకత ఏర్పడింది. సింగరేణిలో డోర్డెలవరీకి సంబందించి రవాణా చార్జలను యజమాన్యమే చెల్లిస్తున్నప్పటికీ ఇల్లెందు ఏరియాలో ఒక్కో సిలిండర్కు రూ. 20నుంచి రూ. 30 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని కార్మిక కుటుంబాలు ఆరోపిస్తున్నాయి. ఐదు కిలోమీటర్ల పరిధివరకు ఉచితంగా డోర్ డెలవరీ చేయాల్సి ఉన్నప్పటీకీ అధికారుల పట్టించుకోవడం లేదన్న కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్మిక కుటుంబాల ఆదరణ కీలకం డివిజనల్ మేనేజర్ వరప్రసాద్ప్రవేట్ వ్యాపార సంస్థలతో పోల్చితే సింగరేణి సూపర్బజార్లలో నిత్యావసర, ఫ్యాన్సీ తదితర వస్తువుల ధరలు తక్కువగానే ఉన్నాయి. కార్మికులు, అధికారులకు సూపర్బజార్లలో నెలకు రూ. 10వేల క్రెడిట్ సౌకర్యం కూడా యజమాన్యం కల్పించింది. సింగరేణి కుటుంబాల ఆదరణ లభిస్తే సూపర్బజార్ల సేవలు మరింత విస్తృతం చేస్తాం.

# మళ్లీ ట్యాంకర్లు

ఇల్లెందు : : ఇంటింటికీ మిషన్ భగీరథ ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించినప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్నంగా ఉందన్న విమర్శలు అల్లాదుర్గం మండలంలో వెల్లువెత్తుతున్నాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్భగీరథ పథకం అధికారుల నిర్లక్ష్య వైఖరితో ప్రభుత్వ ఆశయం నెరవేరడం లేదు. ఫలితంగా ప్రజలు తాగునీటి కోసం అల్లాడే పరిస్థితి ఏర్పడింది. అల్లాదుర్గం మండలంలోని వెంకట్రావుపేటలో మూడేళ్లుగా మిషన్భగీరథ పథకం ద్వారా సరఫరా చేస్తున్న తాగునీరు నిలిచిపోయింది. అయితే సర్పంచ్ బాలమణి ఆర్డబ్ల్యూఎస్ పథకం కింద ఏర్పాటు చేసిన బోరు ద్వారా తాగునీటిని అందిస్తున్నారు. వారం, పదిరోజులుగా గ్రామంలో పలు కాలనీల్లో నీటిసరఫరా అంతంత మాత్రంగా వస్తుండడంతో తాగునీటికి సమస్య తీవ్రమవడంతో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా భూగర్భజాలాలు అడుగంటి, తాగునీటి బోర్లు పనిచేయకపోతే సమస్య మరింత జటిలమయ్యే ప్రమాదం ఉందని, ఈ విషయాన్ని అధికారులకు విన్నవించినా తమ గోడు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి గ్రామంలో మిషన్భగీరథ ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తుంటే తమ గ్రామానికి ఎందుకు ఇవ్వడం లేదని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై ఉన్నతస్థాయి అధికారులు స్పందించకుంటే మండల పరిషత్ కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళన కార్యక్రమాలు చేపడుతామంటు వెంకట్రావు పేట గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు.

పనులు మానుకుని నీటి కోసం ఎదురుచూపులు

– రేగోటి శమంత, వెంకట్రావుపేటఇతర గ్రామాలకు మిషన్భగీరథ నీటిని సరఫరా చేస్తూ మా ఊరికి మాత్రం ఎందుకు ఇవ్వరు. గ్రామంలో ఏర్పడిన తాగునీటి ఎద్దడితో ప్రతిరోజు ట్యాంకర్ కోసం ఉపాధి పనులు మానుకుని ఎదురుచూడాల్సి వస్తుంది. రాబోయే రోజుల్లో ఈ సమస్య మరింత జఠిలం అయ్యే అవకాశం ఉంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

అధికారులకు విన్నవించాం– బాలమణి, సర్పంచ్ వెంకట్రావుపేటమూడేళ్లుగా గ్రామానికి మిషన్ భగీరథ కింద తాగునీరు సరఫరా కావడం లేదని ఉన్నతస్థాయి అధికారులకు ఫిర్యాదు చేశాం. అయినా అధికారులు స్పందించడం లేదు. గ్రామంలో రోజురోజుకు జఠిలమవుతున్న తాగునీటి ఎద్దడి నివారణకు గ్రామ పంచాయతీ తాగునీటి ట్యాంక్ ద్వారా ఇంటింటింటికీ నీటిని సరఫరా చేస్తున్నాం. ఉన్న ఒక్క బోరులోని నీరు అడుగంటితే గ్రామంలో నీటిఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉంది.

# చెరువు శిఖం.. చిక్కిశల్యం..!

మహబూబాబాద్ : ఆక్రమణదారులు ప్రభుత్వ భూములే కాదు.. ఖాళీగా ఏ జాగా కనిపించినా అక్కడ పాగా వేస్తున్నారు. పంట కాలువలే కాకుండా చెరువు శిఖాన్ని కూడా వదలడం లేదు. ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్)గా నిర్దేశించిన శిఖం భూముల్లోనూ నిర్మాణాలు చేపట్టకూడదని నిబంధనలు చెబుతున్నా.. యథేచ్ఛగా శాశ్వత కట్టడాల జోరు కొనసాగుతోంది. చెరువు, కుంటల మధ్యన పట్టా భూములు ఉన్నాయంటూ కొందరు అధికారుల సహకారంతో సరిహద్దులు నిర్ణయించుకొని సిమెంట్ స్తంభాలు పాతుతున్నారు. ప్రధానంగా మహబూబాబాద్‌లోని పలు చెరువులు, కుంటలు ఇప్పటికే సగానికి పైగా మాయమయ్యాయి. తప్పుడు సమాచారాలతో సర్వే నెంబర్ల పేరిట హద్దులు నిర్ణయించుకుని కొందరు తమ దందాను కొనసాగిస్తున్నారు. పట్టణంలో ఉన్న చెరువుల ఆక్రమణపై సమగ్ర నివేదిక ఇవ్వాలని స్వయంగా జిల్లా కలెక్టరు సంబంధిత రెవెన్యూ, నీటి పారుదల శాఖ, పురపాలక సంఘం అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. కొన్ని చోట్ల నిర్మాణం చేసుకుంటున్న పేదల ఇళ్లను తొలగిస్తున్న అధికారులు పెద్దల భవనాల జోలికి వెళ్లకుండా వదిలివేస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. పలుకుబడి ఉన్నవారు చెరువులు, కుంటలు మాయం చేస్తూ విక్రయాలు సైతం నిర్వహిస్తున్నారు. కొన్ని



స్థలాలు ఇప్పటికే పలువురి చేతులు మారాయి. తామేమి చేయలేమంటూ కొందరు అధికారులు వ్యాఖ్యానించడం గమనార్హం. జిల్లా కేంద్రంతోపాటు వివిధ మండలాల్లో కూడా చెరువులు, కుంటల ఆక్రమణ సాగుతుందనే ఆరోపణలున్నాయి.

**మధ్యలో హద్దులు..** ఈ చిత్రంలో కనిపిస్తున్నది మహబూబాబాద్‌లోని పోతిరెడ్డి కుంట. 22 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ కుంట నుంచి సుమారు 50 ఎకరాలకు నీరు అందుతుంది. ఇందులో ప్రభుత్వ భూమి కొంత, పట్టా భూమి కొంత ఉంది. ప్రైవేట్ పట్టా నెంబర్లతో కుంటను ఆక్రమించేందుకు కొందరు వ్యక్తులు ప్రయత్నిస్తున్నారు. నిండా నీళ్లు ఉన్న కుంట మధ్యలో హద్దులు నిర్ణయించి స్తంభాలను ఏర్పాటు చేయడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. సంబంధిత శాఖల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సుమారు ఏడున్నర ఎకరాలకు పైగా ఉన్న ప్రభుత్వ భూమి అక్రమార్కుల పరమయ్యే అవకాశం ఉందని స్థానికులంటున్నారు.

**పట్టా భూమిగా చూపి..**


నెల్లికుదురులోని పెద్ద చెరువుకు సంబంధిం చిన 15 ఎకరాల భూమి ఆక్రమణకు గురైంది. ఈ చెరువు శిఖం సమీపంలోనే ప్రైవేట్ భూములున్నాయి. కొందరు వ్యక్తులు కొన్నాళ్ల కిందట తమ సర్వే నెంబర్‌లో ఉన్న సుమారు 15 ఎకరాల భూమిని సాదా కాగితాలతో విక్రయించారు. రెవెన్యూ రికార్డులో మాత్రం పేరు మార్పిడి కాలేదు. ఆ భూమిని కొనుగోలు చేసినవారు ప్రస్తుతం సాగు చేసుకుంటున్నారు. ధరణి పోర్టల్ వచ్చిన తర్వాత పాత యాజమానుల పేరిటనే రికార్డుల్లో భూమి ఉండడంతో ఇదే అదనుగా భావించి ఆ భూమి యాజమానులు చెరువు శిఖం భూమిని ఆక్రమించుకొని 15 ఎకరాల మేర రాతిఖనీలు పాతి వివిధ ప్రాంతాలకు చెందిన వ్యక్తులకు విక్రయిస్తున్నారు. దీంతో చెరువు విస్తీర్ణం తగ్గిపోయింది. అధికారులకు తెలిసినా ఎవరూ పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

**ఆక్రమణలకు హద్దుల్లేవు**

మహబూబాబాద్ పట్టణంలోని బంధం చెరువులో సుమారు 30 ఎకరాల శిఖం భూమి ఉంది. కొందరు సమీపంలోని ప్రైవేట్ భూముల సర్వే నెంబర్లు వేసి విక్రయించడంతో ప్రస్తుతం ఆ బంధం చెరువులో పది ఎకరాలు కూడా కనిపించడం లేదు. ఇందులో నిర్మాణాలు సాగుతున్నాయి. మహబూబాబాద్‌లోని గుముడూర్ శివారులోని జగన్నాయకుల చెరువులో 201 ఎకరాల భూమి ఉంది. ఇప్పటికే సుమారు 30 ఎకరాలకు పైగా ఆక్రమణకు గురైంది. మహబూబాబాద్ పట్టణంలోని కృష్ణసాయి కుంటలో ప్రభుత్వ భూమి కొంత, ప్రైవేట్ వ్యక్తుల భూమి కొంత ఉంది. ఈ కుంటలో సగం భూమిలో ఇళ్లు వెలిశాయి. మహబూబాబాద్ పట్టణంలోని నిజాం చెరువు 30 ఎకరాల శిఖం భూమి ఉంది. ఈ చెరువు శిఖం కూడా ఆక్రమణకు గురైంది. మహబూబాబాద్ పురపాలక సంఘం పరిధిలోని రాభద్రు చెరువు, రామసముద్రం కుంట, గుండ్లకుంట, బేతోలులోని మైసమ్మ కుంటలతో పాటు మరికొన్ని కుంటలు కూడా ఆక్రమణదారుల చేతుల్లో ఉన్నాయి. కురవి మండలం నేరడ పెద్ద చెరువు శిఖంలో కొందరు వ్యవసాయ బావులు తవ్వి ఆ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు.

# చేపల పెంపకంతో ఆర్థిక సాధికారత

తాడ్వాయి : చేపల పెంపకంతో గిరిజనుల్లో ఆర్థిక సాధికారత వస్తుందని ఐటీడీఏ పెసా కోఆర్డినేటర్ కొమరం ప్రభాకర్ అన్నారు. సమ్మక్క-సారలమ్మ తాడ్వాయి మండలంలోని లింగాల గ్రామంలో 26 మంది, కొడిశలలో 15, అల్లిగూడెంలో 11 మందితో లింగాల గ్రామంలోని ఊర చెరువులో మత్స్యశాఖ ఆధ్వర్యంలో నైపుణ్య పరీక్షలు నిర్వహించారు. వల విసరడం, ఈత కొట్టడం, వల లాగడం.. మూడు రకాల పరీక్షలు నిర్వహించారు. పెసా జిల్లా కోఆర్డినేటర్, మత్స్యశాఖ



జిల్లా అధికారి శ్రీపతి మాట్లాడుతూ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల్లో నీలి విప్లవాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. ఉచిత చేప పిల్లలు, తెప్పలు, 75 శాతం రాయితీతో మోటారు వాహనాలు ఇస్తోందన్నారు. రూ.5 లక్షల బీమా వసతిని కూడా కల్పిస్తోందని చెప్పారు. ఈ పథకాన్ని ప్రతి గిరిజనుడు సద్వినియోగం చేసుకుని సాధికారత వైపు ముందడుగు వేయాలని కోరారు. స్థానిక సర్పంచి ఊకె మౌనిక, నాగేశ్వర్‌రావు, క్షేత్రాధికారి రమేష్, న్యాయవాది మడి సాయిబాబు, కృష్ణ, పెండకట్ల సాగర్, కుల పెద్ద తోలెం రామచంద్రయ్య, చేల సారయ్య, గుమ్మడి ఎర్రయ్య, కొమరం చంద్రయ్య, ఈక రవీందర్ పాల్గొన్నారు.

# ఆక్రమణలకు హద్దే లేదు!



నర్సంపేట : జిల్లాతోపాటు వరంగల్ మహానగర పరిధిలో చెరువులు, కుంటలు, అనుబంధ నాలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. ప్రైవేటు వ్యక్తుల చెరలో చెరువులు కుదించుకుపోతున్నాయి. నగరం శరవేగంగా విస్తరించడంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. సంధు దొరికితే చాలు రాత్రికి రాత్రే చెరువులు, కుంటలు, శిఖం భూములు ప్లాట్లుగా మారుతున్నాయి. ఇప్పటికే కాజీపేట, హనుమకొండ, వరంగల్ త్రినగరాల్లో చెరువులు, కుంటలు కనుమరుగై కాలనీలయ్యాయి. 42 విలీన గ్రామాల్లోనైనా కాపాడాలని పర్యావరణ వేత్తలు, సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు. రెవెన్యూ, భూమి, కొలతల శాఖోలు హద్దులు తేల్చడం లేదు. చెరువులు, కుంటలు, పంట కాలువలు, పూడ్చి పెద్ద పెద్ద భవనాలు, నివాస గృహాలు నిర్మిస్తున్నా నీటి పారుదల, రెవెన్యూ శాఖ అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పాతకాలం నాటి రికార్డుల ప్రకారం క్షేత్రస్థాయిలో చెరువులు, కుంటలు, అనుబంధ కాల్వలు కనిపించడం లేదు. లోకాయుక్త న్యాయస్థానం ఆదేశించినా అధికారులు కదలడం లేదు.

**కాగితాల్లోనే వివరాలు**

కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ(కుడా) పరిధిలో 1000 చెరువులు, కుంటలు ఉన్నాయిని వరంగల్ నూతన బృహత్ ప్రణాళికలో పొందుపరిచారు. పాతకాలం నాటి రికార్డులు, ఇరిగేషన్, రెవెన్యూ శాఖ వివరాల ఆధారంగా చూపించారు. గ్రేటర్ వరంగల్ పరిధిలో 200 చెరువులు, కుంటలు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఇందులో సగం వరకు ఆక్రమణలో ఉన్నాయని అధికారులంటున్నారు.

**ఎఫ్‌టీఎల్ నిబంధనలున్నా..**

దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో చెరువులు, కుంటలు కాపాడుకోవాలని భారత అత్యున్నత న్యాయస్థానం(సుప్రీంకోర్టు) 2012లో పూర్తి స్థాయి చెరువు నీటి మట్టం(ఎఫ్‌టీఎల్) అమలు చేయాలని ఆదేశాలు జారీచేసింది. 2013 నుంచి దేశవ్యాప్తంగా ఈ నిబంధనలు అమల్లోకి వచ్చాయి. కాజీపేట, హనుమకొండ, వరంగల్ త్రినగరాల్లో 15 చెరువులకు ఎఫ్‌టీఎల్ హద్దులు పెట్టాలని నిర్ణయించారు. తొలి విడతలో 9 చెరువులకు క్షేత్రస్థాయిలో సిమెంటు దిమ్మెలు ఏర్పాటు చేశారు.

**ఇదిగో చిట్టా**

కాజీపేట బంధం చెరువు సగం కనుమరుగైంది. ఎఫ్‌టీఎల్ నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు జరుగుతున్నాయి.

హనుమకొండ పెద్ద వడ్డేపల్లి చెరువు ప్రైవేటు చెరలో ఉంది. పదేళ్లవుతున్నా ఇంతవరకు ఎఫ్‌టీఎల్ హద్దులు ఖరారు చేయలేదు. దీంతో చెరువు చుట్టూ వాణిజ్య, నివాస భవనాలు వెలిశాయి.

హంటర్ రోడ్ న్యూశాయంపేట కోటి చెరువు విస్తీర్ణం తగ్గింది. భట్టుపల్లి రోడ్, రైల్వేగేటు వద్ద ఆక్రమణలున్నాయి.

వరంగల్- హనుమకొండ నగరాల మధ్య ఉన్న భద్రకాళి చెరువు విస్తీర్ణం ఏటేటా తగ్గుతోంది. ఎఫ్‌టీఎల్ నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు వచ్చేశాయి. కొందరు ప్రైవేటు వ్యక్తులు చెరువు మాదేనంటూ తాజాగా తెరమీదకు వచ్చారు.

ములుగురోడ్ కోట చెరువును ప్లాట్లుగా మార్చేస్తున్నారు. గౌతమినగర్, కేఎల్.మహేంద్రనగర్, డాక్టర్స్ కాలనీ వైపు ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించేశారు. ఎఫ్‌టీఎల్ నిబంధనలు పాటించడం లేదు.

వరంగల్ దేశాయిపేట చిన్నవడ్డేపల్లి చెరువును మింగేస్తున్నారు. చుట్టూ నివాస గృహాలు, బడా భవనాలు వెలిశాయి. తాజాగా కొందరు పేదలు చెరువులోనే గుడిసెలు వేశారు. ఎఫ్‌టీఎల్ నిబంధనలు గాలికొదిలేశారు.

రంగశాయిపేట బెస్తం చెరువు పరిసరాలు కాలనీలుగా మారాయి. వరద నీరు పారే నాలాను మూసేశారు.

రంగశాయిపేట మద్దెలకుంట, పుల్లాయికుంట స్థలాలు కాలనీలయ్యాయి.

ఉర్సు రంగసముద్రం చెరువు చుట్టూ ఆక్రమణలే. వరద నీరు పారే నాలాను కొందరు ప్రైవేటు వ్యక్తులు ప్లాట్లు చేసి అమ్మేశారు.

గొర్రెకుంట కట్టమల్లన్న చెరువు, మామునూరు, వసంతపూర్, నక్కలపల్లి, బొల్లికుంట, కడిపికొండ, భట్టుపల్లి, హసన్‌పర్తి తదితర విలీన గ్రామాల్లో చెరువులను స్థిరాస్తి వ్యాపారులు ప్లాట్లు చేస్తున్నారు.

**ఎటు చూసినా నిర్మాణాలే..**

ఇది మాధన్నపేట పెద్ద చెరువు పెద్ద కాలువ. నర్సంపేట పట్టణాన్ని ఆనుకొని మొత్తం 7 కి.మీ నిడివితో ఉంటుంది. సుమారు 4 కి.మీ. పొడవునా ఎడమ వైపు గట్టు భూమిని కలుపుకుని పక్కా నిర్మాణాలు చేశారు. కాలువ కుడి వైపునుండే ఆయకట్టు రోడ్డును పలువురు స్థిరాస్తి వ్యాపారులు వారి సొంత ఆస్తిలా కలుపుకొని వెంచర్ రహదారిగా చూపించి ప్లాట్లు అమ్మి రెండు చేతులా సంపాదిస్తున్నారు.

**ఉనికే లేని 'జాలుబంధం'..**

పాకాల చెరువు కింద సర్వాపురం, ద్వారకపేట పంట పొలాలకు సాగు నీరందించేందుకు జాలు బంధం కాలువ ఏర్పాటు చేశారు. సుమారు 4కి.మీ నిడివితో 30 అడుగుల వెడల్పుతో ఉంటుందని నీటి పారుదల శాఖ అధికారులు చెప్పారు. నర్సంపేట మున్సిపాలిటీలో సర్వాపురం, ద్వారకపేట గ్రామాలు పట్టణంలో విలీనమయ్యాయి. స్థిరాస్తి వ్యాపారుల పుణ్యమాని పంట పొలాలు ఇళ్లు కాలనీలయ్యాయి. కాలువ కుడి వైపున గట్టును కలుపుకొని ఇళ్లు, భవనాలు నిర్మించారు. చివరకు కాలువ ఉనికి లేకుండా పోయింది. జాతీయ రహదారి ఆవలి వైపు కాలువను పూడ్చి కబ్జా చేయగా పత్రికల్లో కథనాలు రావడంతో అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు.

**కాలువకు దారేదీ?**

నెక్కొండ: నెక్కొండ చెరువుకు వచ్చే ఎస్సారెస్పీ కాలువ పూర్తిగా ఆక్రమణకు గురికావడంతో కాలువ నీరు పంటపొలాల్లోకి వస్తోంది. దీంతో రైతులు తమ భూమిలో పండిస్తున్న పత్తి, మొక్కజొన్న పంటలు పూర్తిగా ధ్వంసమవుతున్నాయి. రైతులు పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నిబంధనలు బేఖాతరు**

లక్నేపల్లి, రాములునాయక్‌తండా, మహేశ్వరం గ్రామాల రైతులకు సాగునీటి కోసం నిర్మించిన డీబీఎం-40 ఉపకాలువ పరిధిలో సుమారు 1200 ఎకరాల ఆయకట్టు ఉంది. నర్సంపేటకు చెందిన ఓ వైద్యుడు అనుమతుల్లేకుండా వేడుకల మందిరాన్ని ఉప కాలువ కలుపుకుని నిర్మిస్తున్నాడు. కాలువకు రెండు వైపులా 7 మీటర్ల చొప్పున ఎలాంటి నిర్మాణాలు చేయరాదు. వేడుకల మందిరం నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామని డీఈఈ సంతోష్ తెలిపారు. చెరువు శిఖం భూమిలో..కత్రియాల ముసలమ్మ మర్రి వద్ద 39 గుంటల భూమి, కత్రియాల చెరువు శిఖం సుమారు 10 ఎకరాలకు పైగా కొంతమంది ఆక్రమించుకుని సాగు చేస్తున్నారు. ఉప్పరపల్లి క్రాస్ వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న భూమిలో అక్రమ నిర్మాణాలు చేపట్టారు.

# పడిపోతున్న మక్కల ధర

మహబూబాబాద్ : మక్కల ధర రైతన్నల్లో ఆందోళన కలిగిస్తోంది.. గత ఏడాది యాసంగిలో క్వింటాలుకు రూ.2,350 ధర పలకడంతో ఈసారి కూడా అదే ధర ఉంటుందని ఆశించిన అన్నదాతలు సాగు విస్తీర్ణాన్ని పెంచారు. తీరా చేతికొచ్చిన మక్కలను తీసుకొని మార్కెట్‌కు వెళ్తే పడిపోతున్న ధరలతో నిరాశకు గురవుతున్నారు. ధరలు మరింత తగ్గితే మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను తెరిచి మద్దతు ధరతో కొనుగోలు చేయాల్సిందేనని అన్నదాతలు వాపోతున్నారు. లేకుంటే ప్రైవేటు వ్యాపారులు చెప్పిన ధరకు విక్రయించాల్సిన దయనీయ పరిస్థితులు ఎదురుకానున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారుల చేతుల్లో దోపిడీకి గురికాక ముందే అధికారులు తగిన చర్యలు చేపట్టాలని మొక్కజొన్న రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

**సాగు తీరు ఇలా**

జిల్లాలో యాసంగిలో 45 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగైనట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఎకరాకు సుమారు 30 క్వింటాళ్ల చొప్పున దిగుబడి అంచనా కాగా ఈ లెక్కన 13,50,000 క్వింటాళ్ల దిగుబడి రానుంది.

**ఇదీ పరిస్థితి**

ప్రస్తుతం రోజూ కేసముద్రం మార్కెట్‌కు 4 నుంచి 9 వేల క్వింటాళ్లు, మహబూబాబాద్ విపణికి 1500 నుంచి 3500 క్వింటాళ్ల చొప్పున మక్కలు వస్తున్నాయి. కేసముద్రంలో ఫిబ్రవరిలో క్వింటాలుకు గరిష్ఠంగా రూ.2218 ధర పలకగా, మార్చి 28న రూ.2129 ధర ఉంది. ఏప్రిల్ 3న క్వింటాలుకు గరిష్ఠంగా రూ.2078, 4వ తేదీన రూ.2066కు ఖరీదు చేశారు. బుధవారం మార్కెట్‌కు సెలవు కాగా గురువారం గరిష్ఠంగా రూ.2020 మాత్రమే పలికింది. కేసముద్రం మార్కెట్‌లో కనిష్ఠ మద్దతు ధరకన్నా తక్కువగా క్వింటాలుకు రూ. 1709 వచ్చింది. మహబూబాబాద్ మార్కెట్‌లోనూ ధర తగ్గుతోంది. విపణికి ఇంకా మక్కలు అధికంగా వస్తే ధర మరింత తగ్గే అవకాశాలున్నాయని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. ఈ లెక్కన రైతులు ప్రైవేటు వ్యాపారులు చేతుల్లో మోసపోకుండా ఉండేందుకు మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలని అన్నదాతలు కోరుతున్నారు.

**కారణం ఇదే**



తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, బిహార్ తదితర రాష్ట్రాల్లో సాగు విస్తీర్ణం పెరగడమే ధరలు పడిపోవడానికి కారణమంటూ ఒక వ్యాపారి చెప్పారు. గత ఏడాది కేసముద్రం, మహబూబాబాద్ ప్రాంతం నుంచి ఇతర రాష్ట్రాలకే కాకుండా విదేశాలకు కూడా ఎగుమతి అవ్వడం వల్లనే అధిక ధరలు పలికాయని ఇప్పుడు ఆ పరిస్థితులు లేవని అందువల్లనే పడిపోతున్నాయని చెబుతున్నారు.

**ఎన్నో ఆశలు పెట్టుకున్నాం- బొగ్గుల యాలాద్రి, కల్వల, కేసముద్రం**

రెండేళ్లుగా మొక్కజొన్న రైతులను కాపాడుతుంది. ఇతర పంటలు నష్టపోయినా మక్క పంటలో ఆశించిన దిగుబడులను పొందడంతో పాటు గిటుబాటు ధరను పొందాం. ప్రస్తుతం మార్కెట్‌లో రోజు రోజూకు ధర తగ్గుతుంది. గత ఏడాది కేసముద్రం మార్కెట్‌లో క్వింటాలుకు రూ.2300 ఉంటే ప్రస్తుతం రూ. 2 వేలు మాత్రమే ఉంది. మరింత తగ్గితే ప్రభుత్వం వెంటనే రంగంలోకి దిగి మద్దతు ధరకు ఖరీదు చేయాలి.

**ఈసారి పెట్టుబడి వ్యయం పెరిగింది- రాంజీనాయక్, మూలస్తంభం తండా, కేసముద్రం**

మొక్కజొన్నకు చీడపీడల ఎక్కువగా ఉండటంతో పెట్టుబడి పెరిగింది. గతంలో ఎకరం సాగుకు రూ.20 వేలు అయితే ప్రస్తుతం పురుగు మందుల వినియోగం ఎక్కువ కావడంతో రూ.30 వేలు ఖర్చు చేశాం. క్వింటాకు రూ.2 వేల పైన ధర పలికితేనే గిట్టుబాటు అవుతుంది. మద్దతు ధరను పెంచి ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.

# పెరిగిన రేషన్ బియ్యం కోటా

నిజామాబాద్ : రేషన్ బియ్యం కోటా పెరిగింది. గతేడాది డిసెంబరు వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ఆహార భద్రత కార్డులోని సభ్యుడి(యూనిట్)కి 10 కిలోల చొప్పున ఉచితంగా అందజేశారు. ఆహార భద్రత చట్టం ప్రకారం ఈ ఏడాది చివరి వరకు పొడిగించాలని కేంద్రం నిర్ణయం తీసుకున్నా రాష్ట్ర సర్కారు వాటా కేటాయించలేదు. ఫలితంగా గత మూడు నెలలు(జనవరి, ఫిబ్రవరి, మార్చి) కేంద్రం కోటా 5 కిలోల చొప్పున మాత్రమే పంపిణీ చేశారు. ఈ నెలలో రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద కిలో అందించేందుకు ముందుకు రావడంతో ఇరు సర్కారుల కోటా కలిపి యూనిట్‌కు ఆరు కిలోల చొప్పున బియ్యం ఇవ్వాలని పౌర సరఫరాల శాఖ ఆదేశాలు జారీ చేసింది.

**జిల్లాలో ఇలా**

జిల్లాలో ఇప్పటికే బియ్యం నిల్వలు రేషన్ దుకాణాలకు చేరగా పంపిణీ



కొనసాగుతోంది. అర్హులైన వారందరూ తీసుకుంటే ఈ నెల 15 కల్లా పంపిణీ ఆపేస్తారు. ఎవరైనా మిగిలి ఉంటే గడువు పెంచే అవకాశం ఉంటుంది.

**మే నుంచి బలవర్ధక..**

నిరుపేదలకు పోషక విలువలు అందించి వారిని ఆరోగ్యంగా ఉంచాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా ప్రజా పంపిణీ ద్వారా మే నుంచి బలవర్ధక బియ్యం(పోర్టిఫైడ్ బాయిల్డ్ రైస్) ఇవ్వాలని ఆదేశాలిచ్చింది. క్వింటా సాధారణ బియ్యానికి కిలో పోషకాలు మిళితం చేస్తారు. దీనిపై విస్తృతంగా ప్రచారం కల్పించాలని డీలర్లకు ఆదేశాలు జారీ చేశారు.

**సక్రమంగా పంపిణీ చేయాలి చంద్రప్రకాశ్, డీసీఎస్‌వో**

బియ్యం పంపిణీ సక్రమంగా చేపట్టాలని డీలర్లకు ఆదేశాలు ఇచ్చాం. యూనిట్‌కు ఉచితంగా ఆరు కిలోలు ఇవ్వాలి. పేదలకు ఇచ్చే నిల్వలను ఎవరైనా పక్కదారి పట్టిస్తే చర్యలు తీసుకుంటాం. కార్డుదారులందరికీ సరకు అందుతుంది. ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదు. వచ్చే నెల నుంచి బలవర్ధక బియ్యం అందజేస్తాం.

# ఆహార శుద్ధి.. ఆర్థిక వృద్ధి!

బీర్కూర్ : గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించి ఆర్థిక చేయూతనందించే ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటును కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. వ్యక్తిగతంగా, వివిధ సంఘాల ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న పరిశ్రమలకు మినిస్ట్రీ ఆఫ్ ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీ(ఎంఎఫ్‌పీఐ) ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి మైక్రోఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ ప్రైజెస్ (పీఎంఎఫ్‌ఎంఈ) పథకం ద్వారా రాయితీలు ప్రకటించింది.

**రూ. 10 వేల కోట్ల అంచనాతో**

గ్రామాల్లో ఆహార శుద్ధి పరిశ్రమలకు సంబంధించి ఈ పథకాన్ని ప్రకటించారు. దేశ వ్యాప్తంగా 2024-25 ఆర్థిక సంవత్సరం నాటికి కనీసం 2 లక్షల యూనిట్ల ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో రూ.10 వేల కోట్ల అంచనాతో కేంద్రం బడ్జెట్‌ను ప్రకటించింది. ఈ పథకం ద్వారా గ్రామస్థాయిలో కొత్త పరిశ్రమల ఏర్పాటు .. ఇప్పటికే నడుపుతున్న వాటిని ఆధునికీకరించుకునేందుకు రాయితీలు అందిస్తారు. జిల్లాలో 275 యూనిట్లను నెలకొల్పడమే లక్ష్యంగా అధికారులు ముందుకు సాగుతున్నారు. ఇప్పటి వరకు 61 యూనిట్లు మంజూరు కాగా 26 మంది పరిశ్రమలను నెలకొల్పారు.

**ఉత్పత్తులు ఇవే...**

పిండిగిర్ని, బేకరి, నూనె, కారంపొడి తయారీ, పప్పు మిల్లు, రోటిమేకర్, చిరుధాన్యాల ప్రాసెసింగ్, మసాల దినుసులు, పిండి వంటలు, పుట్టగొడుగులు, పాల ఉత్పత్తులు, అల్లం వెల్లులి పేస్టు, పప్పులు



ఐస్‌క్రీమ్, బెల్లం, చిప్స్, సేమియా, అటుకులు, మరమరాలు తదితర యూనిట్ల ఏర్పాటుకు రాయితీలు అందిస్తారు.

**పథకం ఇదీ..** పీఎంఎఫ్‌ఈ పథకం కింద బ్యాంకు ద్వారా 35 శాతం రాయితీతో రుణం అందిస్తారు.

వ్యక్తిగతంగా వ్యాపారం చేసుకునే వారు రూ.10 లక్షల వరకు రాయితీకి అర్హులు

స్వయం సహాయక (ఎస్‌హెచ్‌జీ), రైతు సంఘాలు (ఎఫ్‌పీవో) రైతు ఉత్పత్తిదారులు (ఎఫ్‌పీసీ), కోఆపరేటివ్ సంఘాల వారు గరిష్ఠంగా రూ. కోటి వరకు రాయితీకి అర్హులు.

వ్యాపారాభివృద్ధికి శిక్షణ..ఉత్పత్తుల మార్కెటింగ్, బ్రాండింగ్ అంశాలపై చేయూతనందిస్తారు.

**సద్వినియోగం చేసుకోవాలి**

సాయన్న, డీఆర్‌డీఓ, కామారెడ్డి గ్రామీణ ప్రాంతాల్లో ఆసక్తి ఉన్న సంఘ సభ్యులు ఈ పథకానికి అర్హులే. రాయితీతో కూడిన రుణం అందిస్తాం. ఆసక్తి ఉన్న వారు మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సంప్రదించాలి.

# అంగన్‌వాడీల నిర్వహణకు పప్పుతిప్పలు!

కొత్తగూడెం : పేద కుటుంబాల చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలు మళ్లీ గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి. లబ్ధిదారులు మెనూ ప్రకారం బలవర్ధక ఆహారానికి నోచుకోవడం లేదు. అందుక్కారణం.. చాలాచోట్ల నూనె, పప్పులు పంపిణీ నిలిచిపోవడమే. వీటిని ప్రభుత్వం ప్రతి రెణ్నెల్లకోసారి సరఫరా చేయాల్సి ఉంది. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలలకు ఇంకా అందించలేదు. దీంతో కొందరు ఉపాధ్యాయురాళ్లే సొంతంగా ఖర్చు భరించి సరకులు కొనుగోలు చేస్తున్నారు. కొత్తగూడెం 9, పాల్వంచ 4, బూర్గంపాడు 3, దుమ్ముగూడెం 3, చర్ల 8, దమ్మపేట 7, చంద్రుగొండ 5, అశ్వారావుపేట 8, మణుగూరు 10, టేకులపల్లి 3, ఇల్లెందు సెక్టారులో మూణ్నెల్లకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు నిర్వాహకుల ద్వారా తెలుస్తోంది.

కూర'గాయాలూ' తప్పడం లేదు..

కూరగాయల బిల్లులు ఏడాది కాలంగా చెల్లించడం లేదని అంగన్‌వాడీ కేంద్రాల ఉపాధ్యాయినులు వాపోతున్నారు. నిత్యావసరాలకు 18 ఏళ్ల క్రితం నిర్ణయించిన ధరలనే అమలు చేస్తున్నారని, ఎన్నో రెట్లు పెరిగినా పరిగణనలోకి తీసుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. మెనూలో ఉండే బాలామృతం, బియ్యం మాత్రమే ప్రస్తుతం సక్రమంగా సరఫరా



అవుతున్నాయని పేర్కొంటున్నారు. గత నెల మార్చి 20 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు 'పోషణ్ పక్వాడా' కార్యక్రమాలను సైతం నిర్వహించారు. చిరుధాన్యాల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమాల నిర్వహణ ఖర్చులనూ నిర్వాహకులకు చెల్లించాల్సి ఉంది.

అందని గ్యాస్ బిల్లులు

సిలిండర్ బిల్లులు ఏడాది కాలంగా అందడం లేదు. ఒక్కో అంగన్‌వాడీలో నెలకు సగటున 10 నుంచి 12 సిలిండర్లు వినియోగిస్తారు. వీటిని సొంతంగా నిర్వాహకులే జీతభత్యాల్లోంచి కొనుగోలు చేస్తున్నారు. ఈ మొత్తాన్ని ప్రభుత్వం తర్వాత చెల్లిస్తోంది. గ్యాస్ బిల్లులూ ఏడాదిగా చెల్లించడం లేదని పలువురు నిర్వాహకులు వాపోతున్నారు. కొత్త పొయ్యిలు కూడా అందించడం లేదు. సిలిండర్ల రవాణాకు రూ.150 నుంచి రూ.200 వరకు ఖర్చవుతున్నా సొంతంగా భరిస్తున్నారు.

అంగన్‌వాడీలకు కావాల్సిన పప్పు, నూనెను వారంలోగా సరఫరా చేస్తాం. కొందరు గుత్తేదారుల నిర్లక్ష్యం కారణంగా సరకుల అందజేతలో ఆలస్యమైంది. ప్రభుత్వ చర్యలతో త్వరలోనే అందజేయనున్నాం. సిలిండర్ల బిల్లుల వివరాలు కూడా పంపించాం. ప్రభుత్వం విడుదల చేసిన వెంటనే ఉపాధ్యాయినులకు చెల్లిస్తాం.

జెఎం స్వర్ణలత లెనీనా, జిల్లా సంక్షేమాధికారి

# కదిలిన దస్త్రం..

కొత్తగూడెం : జూలూరుపాడులో వైద్యవిధాన పరిషత్ పరిధిలోని ముప్పై పడకల ఆసుపత్రి భవనంలో సీహెచ్‌సీ సేవల ప్రారంభానికి ఆటంకాలు తొలగుతున్నాయి. దీనికి సంబంధించిన దస్త్రం పరిశీలనలో ఉండటంతో రెండు, మూడు నెలల్లో వైద్య సేవల పరంగా మార్పులు చేసేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉంది. ముప్పై పడకల ఆసుపత్రి కోసం నిర్మించిన భవనంలోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కొనసాగుతోంది. ఈ భవనం వైద్యవిధాన పరిషత్‌కు అప్పగిస్తే అక్కడ నుంచి పీహెచ్‌సీని ఇతర ప్రాంతానికి మార్చాలి. వైద్యశాఖ ఉన్నతాధికారులు ఇతర గ్రామాల్లో పీహెచ్‌సీని ఏర్పాటు చేసే యోచనపై పరిశీలన చేశారు.

జూలూరుపాడు పరిసర మండలాల గిరిజన ప్రజలు ఎన్నో ఏళ్లుగా మెరుగైన సేవలు కల్పించాలని కోరుతున్నారు. అనేక ప్రజాసంఘాలు, పార్టీలు ఆందోళనలు నిర్వహించి వినతులు అందజేశారు. గతంలోని శాసనసభ్యులు సైతం వైద్య సేవల విషయమై కృషి చేస్తామని హామీలు ఇచ్చినా ఫలితం లేకపోయింది. ప్రస్తుతం ప్రభుత్వమే సేవల విస్తరణకు సముఖంగా ఉండటంతో కొద్ది రోజుల్లోనే జూలూరుపాడులోని ఆసుపత్రి భవనం వైద్యవిధాన పరిషత్‌కు అప్పగించనున్నారు. స్థానిక ఎమ్మెల్యే సైతం దీనిపై దృష్టి సారిస్తే మరింత తొందరగా ఈ ప్రక్రియ అమలయ్యే అవకాశం లేకపోలేదు. గతంలో సీహెచ్‌సీ ఏర్పాటు ప్రతిపాదనలు చేసినా దస్త్రాలేవీ లేకపోవడంతో జాప్యం జరిగింది. ఇటీవల జిల్లా వైద్యాధికారి దృష్టి సారించడం, స్థానిక వైద్యుడు రాకేశ్‌కుమార్ మళ్లీ కొత్తగా ప్రతిపాదనలు పంపడంతో కదలిక వచ్చింది.

పీహెచ్‌సీ మార్చాలి

జూలూరుపాడులో సామాజిక ఆరోగ్య కేంద్రం కోసం నిర్మించిన భవనాన్ని 2007లోనే అప్పటి కుటుంబ, ఆరోగ్యశాఖ మంత్రి సంభాని చంద్రశేఖర్ ప్రారంభించారు. అప్పటి నుంచి సేవలు అందుబాటులోకి వస్తాయని ఆశించినా సాధ్యం కాలేదు. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించి జిల్లాలోని చర్ల, జూలూరుపాడు పీహెచ్‌సీలను సీహెచ్‌సీలుగా మార్చాలనే ప్రతిపాదనలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. జూలూరుపాడులో సీహెచ్‌సీ ఏర్పాటు చేయాలంటే పీహెచ్‌సీని మరోచోటకు మార్చాలి. పడమటినర్సాపురం లేదంటే గుండెపూడి గ్రామాల్లో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కొత్తగా వైద్యశాలను నిర్మించేందుకు రూ.1.20 కోట్లు నిధుల మంజూరుకు సిద్ధంగా ఉంది. పీహెచ్‌సీ ప్రస్తుత భవనం నుంచి తరలిపోవడమే తరువాయి సీహెచ్‌సీ సేవలు ప్రారంభించనున్నట్లు తెలిసింది.'

అందుబాటులోకి వచ్చే సేవలు

సీహెచ్‌సీ ఏర్పాటుచేస్తే అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. శస్త్రచికిత్సలు, చిన్నపిల్లలు, మహిళలు, దంత వైద్య సేవలు ఇలా ఎంతోమంది వైద్య నిపుణులు రానున్నారు. ఇదే జరిగితే అటు 20కి.మీ. దూరం ఉన్న కొత్తగూడెం, ఇటు 60కి.మీ. దూరంలోని ఖమ్మం వెళ్లాల్సిన అవసరం ఉండదు. చంద్రుగొండ, సుజాతనగర్, ఖమ్మం జిల్లాలోని ఏన్కూరు మండలాల ప్రజలకూ వైద్యసేవలు అందుబాటులో ఉండనున్నాయి.

"జూలూరుపాడులో సీహెచ్‌సీ ఏర్పాటుకు ప్రభుత్వం సానుకూలంగా ఉంది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు పంపాం. త్వరలోనే వైద్యవిధాన పరిషత్‌కు ఈ భవనాన్ని అప్పగించాల్సి ఉంది. ఇక్కడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తాత్కాలికంగానైనా వేరే చోటుకు తరలిస్తేనే సేవలు ప్రారంభం అవుతాయి."రాకేశ్‌కుమార్, ప్రభుత్వ వైద్యుడు, జూలూరుపాడు

# ఇంకెన్నాళ్లీ డొంక తిరుగుడు సమాధానం..?



ఖమ్మం :తాతలు, తండ్రుల నుంచి వారసత్వంగా సంక్రమించిన భూముల్లో ఏళ్ల తరబడి పంటలు పండించుకున్నారు. అధికారుల నిర్వాకమో.. ఆన్‌లైన్‌లో తప్పిదమో కానీ.. అకస్మాత్తుగా వారి భూములకు వెళ్లే దారి మాయమైంది. సేద్యం చేసే భూములన్నీ బీడుగా దర్శనమిస్తున్నాయి. ఆ రైతులంతా కాడి వదిలేసి కూలీ పనులకు వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది. సాగు భూములకు వెళ్లేందుకు దారి చూపండి మహాప్రభో అంటూ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.రెండేళ్లుగా బీళ్లుగానే.. నేలకొండపల్లి మండలం తిరుమలాపురంతండాకు చెందిన సుమారు 50 మంది గిరిజనులకు 70 ఎకరాల వ్యవసాయ భూములున్నాయి. క్రమేణా వీరి పంట పొలాలకు వెళ్లే దారి కనుమరుగవటంతో రెండేళ్లుగా రైతులు సాగుకు దూరమయ్యే పరిస్థితి తలెత్తింది. చుట్టుపక్కల భూములు పచ్చని పంటలతో కళకళలాడుతుంటే.. వీరి భూములు మాత్రం బీళ్లుగా మారాయి.

అన్నదాతల పోరుబాట

తరాలుగా తమ భూముల్లోకి వెళ్లేందుకు ఉన్న దారి కనుమరుగవడంతో గిరిజన రైతులు పోరుబాట పట్టారు. వీరి వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లేందుకు తిరుమలాపురంతండాలో 1927 నాటి నక్షాలో డొంక దారి చుట్టూ సుమారు 50 మంది గిరిజనులకు చెందిన 70 ఎకరాల భూములు ఉన్నాయి. రెండేళ్ల క్రితం దారి మాయమైంది. దశాబ్దాల పాటు పంటలు పండిస్తున్న తమను రెండేళ్లుగా భూముల్లోకి వెళ్లనీయకుండా కొందరు అడ్డుకుంటున్నారని అధికారులకు బాధితులు ఫిర్యాదు చేశారు. అయితే.. తాజా నక్షాలో దారి లేదని అధికారులు గుర్తించడంతో వీరి సమస్య మరింత జటిలమైంది. స్థానిక రైతులంతా సమాచార హక్కు చట్టం ద్వారా 1927 నాటి నక్షాను సాధించారు. అందులో గ్రామకంఠం భూమి, 30 అడుగుల డొంక రహదారి స్పష్టంగా ఉందన్న విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నక్షా ఆధారంగా జిల్లా అధికారులను కలిశారు. గిరిజన రైతుల సమస్య పరిష్కరించాలని మండల రెవెన్యూ అధికారులను ఉన్నతాధికారులు ఆదేశించారు. అయినా సమస్య తీరలేదు. అందుకే.. బాధిత రైతులు కరపత్రాలు ముద్రించి న్యాయం చేయాలంటూ ఆందోళనలకు పూనుకున్నారు.మాకు వారసత్వంగా భూమి సంక్రమించింది. చాలా ఏళ్లుగా పంటలు పండించుకున్నాం. రెండేళ్ల నుంచి దారి లేక పంటలు సాగు చేయడం లేదు. చుట్టుపక్కల రైతులంతా పంటలు పండించుకుంటున్నారు. మేము మాత్రం మా భూములను బీడుగా ఉంచుకోవాల్సి వస్తుంది.భూక్యా రమా, తిరుమలాపురంతండా

మా నాన్న నుంచి సంక్రమించిన భూమిలో దశాబ్దాలుగా పంటలు పండిస్తున్నాం. రెండేళ్ల క్రితం దారి లేకుండా కొందరు ఫెన్సింగ్ వేసుకున్నారు. బాట కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవట్లేదు.

మోహన్‌రావు, తిరుమలాపురంతండా

వ్యవసాయ భూములకు వెళ్లేందుకు దారి లేదని, న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. ప్రస్తుత నక్షాలో డొంక దారి లేదు. అయినా వారి సమస్య పరిష్కారానికి చొరవ చూపుతున్నాం.

ధార ప్రసాద్, తహసీల్దారు, నేలకొండపల్లి

# చిట్కాలు ముఖ్యం.. పునశ్చరణ అవసరం



ఖమ్మం : ప్రాథమిక, దేహదారుఢ్య పరీక్షల్లో సత్తాచాటిన ఎస్సై అభ్యర్థులకు ప్రధాన పరీక్ష శని, ఆదివారం జరగనుంది. నెలల తరబడి చదివిన అనేక అంశాలను మూడు గంటల్లో ఎంత మెరుగ్గా రాస్తారనే అంశంపైనే భవితవ్యం ఆధారపడి ఉంటుందని గ్రహించాలి. ఇలాంటి సమయంలో అభ్యర్థులు ఏవిధంగా మెలగాలి, పరీక్ష సమయంలో ఎలా వ్యవహరించాలో నిపుణుల అభిప్రాయాలతో కథనం.

గందరగోళానికి గురికావొద్దు

పరీక్ష సమయంలో అభ్యర్థులు గందరగోళానికి గురికాకుండా ప్రశాంతంగా ఉండాలి. నిర్ణీత సమయం కంటే ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. పరీక్ష ముందురోజు ప్రశాంతంగా నిద్రపోవాలి. ఒత్తిడికి గురికావటం వల్ల పరీక్ష కేంద్రంలో పొరపాటు చేసే ఆస్కారముంది. ఇంతకాలం చదివిన వాటిలో ప్రధానాంశాలను చివరి రోజు పునశ్చరణ చేసుకోవటం ఉత్తమం.

తెలిసిన ప్రశ్నలనే తొలుత ఎంచుకోవాలి..

ఎం.రాధాకృష్ణ, అర్థమెటిక్ ఎక్స్‌పర్ట్ : అర్థమెటిక్, రీజనింగ్ పేపర్‌లో అన్ని ప్రశ్నలను నిశితంగా ఒకసారి చదవాలి. బాగా తెలుసు అనుకున్న ప్రశ్నలను తొలుత ఎంచుకొని మొదటి రెండు గంటలు జవాబులకు కేటాయించాలి. తెలియని ప్రశ్నల కోసం ఆలోచించి సమాధానాలు రాసేందుకు మిగతా గంట సమయాన్ని వినియోగించుకోవాలి. మ్యాథమెటికల్ స్టూడెంట్ ముందే అర్థమెటిక్ ప్రశ్నలను ఎంపిక చేసుకోవాలి. ఆ తరువాత రీజనింగ్‌పై దృష్టి సారించాలి. అప్పుడే సునాయసంగా అన్నింటిని రాయగలుగుతారు.

నెగిటివ్ మార్కులుండవు

పంపన శివప్రసాద్, పోటీ పరీక్షల నిపుణుడు : ఎస్సై మెయిన్స్ పరీక్షలో పదోతరగతి స్థాయిలో ఉండే తెలుగు, ఆంగ్ల పేపర్లుంటాయి. వీటిలో అర్హత సాధిస్తేనే జనరల్ స్టడీస్, అర్థమెటిక్ రీజనింగ్ పరీక్ష పత్రాలు దిద్దుతారనే విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. ప్రిలిమినరీ పరీక్షల మాదిరిగా మెయిన్స్‌లో నెగిటివ్ మార్కులుండవు. జనరల్ స్టడీస్‌లో హిస్టరీ ఆఫ్ ఇండియా, తెలంగాణ చరిత్ర, తెలంగాణ ఉద్యమం, రాజ్యాంగం, వర్తమాన వ్యవహారాలు, భూగోళశాస్త్రం ఉంటాయి. మ్యాథ్స్ విషయంలో సమయం వృథా కాకుండా జాగ్రత్తపడాలి. సాధ్యమైనంత వరకు అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయాలి.

# లెక్క మారుతోంది..

ఖమ్మం :2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి 31 వరకు మద్యం అమ్మకాలు ఉమ్మడి జిల్లా పరిధిలో ఇన్వాయిస్ ప్రకారం: రూ.2272 కోట్లు (అంటే డిపో నుంచి వ్యాపారులకు కేటాయించిన ధర ప్రకారం) ఎమ్మార్పీ ప్రకారం: రూ.2702 కోట్లు అదనపు ధరకు విక్రయించడం ద్వారా..: రూ.3 వేల కోట్లకు పైగా

ఉమ్మడి జిల్లాలో మద్యం అమ్మకాలు ఏటేటా తారస్థాయిలో పెరుగుతున్నాయి. వీటి విలువ లెక్కింపులో ఆసక్తి రేకెత్తించే గణాంకాలు నమోదవుతున్నాయి. వైరాలోని మద్యం డిపో నుంచే ఖమ్మం, భద్రాద్రి జిల్లాలోని దుకాణాలు, బార్లకు మద్యం సరఫరా అవుతోంది. ఏటా ఆర్థిక సంవత్సరం పూర్తి కాగానే ఎంత విలువైన సరకు విక్రయించారో సరిచూస్తున్నారే కానీ తుది అంకానికి చేరేసరికి భారీ వ్యత్యాసాలుంటున్నాయి. వ్యత్యాసం ఏదో రూపాయో లేక రూ.లక్ష కాదండోయ్... నిశితంగా పరిశీలిస్తే రూ.వందల కోట్లలో ఉంటోంది.ఉల్లంఘన విలువ ఎంతంటే..డిపో నుంచి ఇన్వాయిస్ ధరకు మద్యం కొనుగోలు చేస్తున్న వ్యాపారులు దుకాణాల వద్ద ఎమ్మార్పీ ప్రకారం విక్రయిస్తుంటారు. ఎమ్మార్పీ జతచేసి విక్రయించడం వల్ల సుమారు రూ.400 కోట్లు అదనంగా వసూలు చేస్తున్నారు. ఇక్కడ మరో మతలబు ఉంది. వ్యాపారులు కొనుగోలు చేసిన సరకును సింహభాగం బెల్టు దుకాణాల్లోనే విక్రయిస్తున్నారు. రెండు జిల్లాల పరిధిలో సుమారు 8 వేలకు పైగా బెల్టు దుకాణాలున్నాయి. రూ.200 ఎమ్మార్పీ ఉన్న క్వార్టర్ సీసా బెల్టు దుకాణదారునికి రూ.20 అదనంగా ఇస్తుంటే అక్కడ నుంచి మద్యం



కొనుగోలు చేసే వ్యక్తి నుంచి మరో రూ.15 నుంచి రూ. 20 వరకు వసూలు చేస్తున్నారు. ఎమ్మార్పీ ఉల్లంఘనతో అదనపు విలువ రూ.300 కోట్లకు పైగా ఉంటుంది.

ఎన్నికల తరుణం

రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలకు మరో ఆరేడు నెలలు మాత్రమే సమయం ఉంది. దీంతో ఈ సీజన్ మొత్తం మద్యం అమ్మకాలు తారస్థాయిలో ఉండనున్నాయి. ఇప్పటికే ఎండల తాకిడితో బీర్ల విక్రయాలు పెరిగాయి. ఈ విక్రయాలు పెరిగినా లిక్కర్ విక్రయాలు ఏ మాత్రం తగ్గడం లేదు. వచ్చే ఎన్నికల సీజన్ కావడంతో ఈ ఏడాది విక్రయాలు ఊహించలేనంతగా ఉండే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

# చిగురిస్తున్న ఆశలు

గుండాల : రెండో విడత గొర్రెల పంపిణీపై ఆశలు చిగురిస్తున్నాయి. గొల్ల, కుర్మ కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం 2017 జూన్‌లో గొర్రెల పంపిణీ పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఇటీవల వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులకు సూచించారు. దీంతో జిల్లాలో ఆ దిశగా అధికారులు చర్యలకు ఉపక్రమించారు. మొదటి విడత సజావుగా సాగినా.. రెండో విడతకొచ్చేసరికి జీవాల ధరలు పెరగడం.. ఇతర కారణాలతో కాలయాపన జరిగింది. మరోపక్షం రోజుల్లో పంపిణీ మొదలయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో ఇలా..ఉమ్మడి జిల్లాలో రెండో విడత గొర్రెల పంపిణీకి 67,949 మంది లబ్ధిదారులు ఎంపికయ్యారు. మొదటి విడత సమయంలో యూనిట్ విలువ రూ.1.25 లక్షలు. లబ్ధిదారులు వాటా రూ.32,250 కాగా.. మిగతా సొమ్మును ప్రభుత్వం భరించేది. ప్రస్తుతం జీవాల ధరలు పెరగడంతో ప్రభుత్వం యూనిట్ విలువ రూ.1.75 లక్షలకు పెంచడంతోపాటు లబ్ధిదారు వాటా రూ.43,750కి పెంచింది. ఈ నెలలోనే పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ఆశలు చిగురిస్తున్నాయి. దాదాపు ఐదేళ్ల క్రితం యూనిట్లు మంజూరు కావడంతో ప్రస్తుతం లబ్ధిదారులు ఎందరున్నారు.. ఎక్కడున్నారు..? వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సి ఉంటుందని పశుసంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాకు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి జీవాలను కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. పారదర్శకతకు ఈసారి జీపీఎస్ సౌకర్యమున్న



వాహనాల్లోనే వీటిని రవాణా చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు సంబంధించి టెండర్లు పిలవాల్సి ఉంది.

ఇంటింటికీ వెళ్లి పరిశీలన

రెండో విడత గొర్రెల పంపిణీకి ఎంపికైన లబ్ధిదారులను ఇంటింటికీ వెళ్లి పరిశీలన చేయనున్నారు. ఇప్పటికే ఆయా మండల కేంద్రాల్లో సమావేశాలు నిర్వహించి పంచాయతీ కార్యదర్శులకు బాధ్యతలు అప్పగించారు. వారు ఇంటికి వెళ్లి లబ్ధిదారులను క్షుణ్ణంగా పరిశీలిస్తారు. ఒక వేళ లబ్ధిదారులు చనిపోతే నామినీగా భార్య, లేదా కుమారులను ఎంపిక చేస్తారు. ఎంపిక పరిశీలన పూర్తయిన వెంటనే పంపిణీ చేపట్టే అవకాశం ఉంది. పక్షం రోజుల్లో ప్రారంభంశ్రీనివా సరావు, జిల్లా పశువైద్య, పశుసంవర్ధకశాఖ అధికారి, సూర్యాపేటరెండో విడత గొర్రెల పంపిణీ విషయమై లబ్ధిదారుల వివరాలను మళ్లీ క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. మరో పక్షం రోజుల్లో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పంపిణీ చేపడతాం.

# డబ్బులొచ్చేశాయ్..!

గుండాల : కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో చదువుతున్న బాలికల్లో నిరుపేదలు, అనాథలు అధిక సంఖ్యలో ఉంటారు. వీరికి వసతితో పాటు భోజనం, పుస్తకాలు, దుస్తులు, దుప్పట్లు ఉచితంగా ప్రభుత్వం అందజేస్తోంది. గతంలో ప్రతినెలా రూ.100 చొప్పున కాస్మెటిక్ ఛార్జీలు చెల్లించేవారు. వీటి స్థానంలో కరోనాకు ముందు వరకు పరిశుభ్రత(హెల్త్ హైజెనిక్) కిట్లు ఇచ్చారు. 2020-21 విద్యా సంవత్సరం నుంచి కిట్లు ఇవ్వలేక పోయారు. ఛార్జీలు సైతం విడుదల కాకపోవడంతో బాలికలు ఒకింత ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా ప్రభుత్వం 2022-23 విద్యాసంవత్సరానికి సంబంధించిన మూడు నెలల ఛార్జీలు విడుదల చేసింది. డిసెంబరు-2022 నుంచి ఫిబ్రవరి-2023 వరకు ఒక్కో విద్యార్థినికి రూ.300 చొప్పున విడుదల చేసింది. ఆయా విద్యార్థినుల బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయి.

ఉమ్మడి జిల్లాకు ఇలా...ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో మొత్తం 49 కస్తూర్బా గాంధీ విద్యాలయాలు ఉన్నాయి. వీటిలో 6 నుంచి 10వ తరగతి వరకు, ఎంపిక చేసిన కొన్ని కస్తూర్బాలలో ఇంటర్మీడియట్ తరగతులు నిర్వహిస్తున్నారు. 12,057 మంది బాలికలు చదువుతున్నారు. కొందరికి ఆధార్ అప్‌డేట్ కాకపోవడం, ఖాతాలు లేకపోవడం లాంటి సమస్యలతో దాదాపు 1,383 మంది బాలికలు విద్యాశాఖకు బ్యాంకు ఖాతా నెంబర్లు ఇవ్వలేదు. ప్రస్తుతం ఖాతా నెంబర్లు అందజేసిన 10,674 మంది బాలికలకు రూ.300 చొప్పున రూ.31,81,200 ప్రభుత్వం బ్యాంకు ఖాతాల్లో జమచేసినట్లు ఉత్తర్వులు జారీ అయ్యాయి. అత్యధికంగా నల్గొండ జిల్లాలో 5,409 మందికి రూ.16,12,400, అత్యల్పంగా యాదాద్రి జిల్లాకు 2,164 మందికి రూ.6,46,400 మంజూరయ్యాయి.

# పల్లెలే.. పర్యాటక కేంద్రాలు

ఆలేరు : భారతదేశ సంస్కృతి, వారసత్వానికి గ్రామసీమలే పునాదులు అన్న విషయం జగమెరిగిన సత్యం. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం చారిత్రక, సంస్కృతి వారసత్వం గల గ్రామాలను ఎంపిక చేసి పర్యాటకంగా ప్రోత్సహించాలని సంకల్పించింది. ఈ నేపథ్యంలో 2023 సంవత్సరానికి జాతీయ స్థాయిలో ఉత్తమ పర్యాటక గ్రామాన్ని ఎంపిక చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా కేంద్ర పర్యాటకశాఖ మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రాథమికంగా మూడు గ్రామాల నుంచి ఎంట్రీలను పంపించాలని నిర్ణయించారు. ఈ గ్రామాలకు చెందిన పూర్తి చారిత్రక ప్రాధాన్యం, అభివృద్ధి, ప్రత్యేకతలకు సంబంధించిన వివరాలతో కూడిన సమాచారం పంపాలని జిల్లా పాలనాధికారి పమేలా సత్పతి ఆదేశించారు.

పూర్తి సమాచారంతో నివేదికలు

ప్రాథమికంగా ఎంపిక చేసిన గ్రామాలకు సంబంధించిన పూర్తి వివరాలతో నివేదికలు తయారు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో ఉన్న పురాతన ఆలయాలు, కట్టడాలు, వాటి ప్రాముఖ్యత, వాటి ఫొటోలు, గ్రామ చారిత్రక నేపథ్యం, గ్రామ ప్రజల జీవనశైలి తదితర అంశాలను సేకరిస్తారు. మొత్తం 20 అంశాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. సమాచార సేకరణ ప్రక్రియ ప్రారంభం కాగా.. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. ఈ నెల 15 నాటికి సమాచారం పూర్తిగా సేకరించి నమోదు చేయాల్సి ఉంటుంది. అనంతర కాలంలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ పర్యాటక గ్రామాల ఎంపిక జరుగుతుంది.

# పరీక్షా కాలం..

మహబూబాబాద్ : ఉన్నత విద్యకు తొలిమెట్టు ఎస్సెస్సీ.. పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ఉపాధ్యాయుల ప్రోత్సాహం, అత్యుత్తమ మార్కులు గడించాలని తల్లిదండ్రులు ఆలోచనలతో విద్యార్థులు అహర్నిశలు కృషి చేస్తున్నారు. ఒక విధమైన డిప్రెషన్.. బాగా చదవాలి.. ఇంకా బాగా రాయాలి.. అందరికన్నా ముందుండేలా మార్కులు, లేదా గ్రేడ్ సాధించాలి.. ఇవే ఆలోచనలు కొందరిని నిద్రకు దూరం చేస్తాయి. మరికొందరిపై మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురి చేస్తాయి. ఈ పరీక్షాకాలంలోనే పిల్లలకు మనోనిబ్బరం కలిగించాల్సిన బాధ్యత వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపైనే ఉంటుందనడంలో అతిశయోక్తి లేదు. ఏడాది పాటు ఇష్టంతో కష్టపడ్డ కాలానికి ప్రతిఫలం దక్కే పరీక్షా కాలం వచ్చేసింది. ఉత్కంఠత, ఉద్వేగాలకు లోనుకాకుండా కొన్ని జాగ్రత్తలు తీసుకోవడంతో ముం దస్తు ప్రణాళికతో విద్యనభ్యసిస్తే ఈ పరీక్షలను కూడా ఆడుతూ పాడుతూ సులువుగా అధిగమించవచ్చని విద్యావేత్తలు సూచిస్తున్నారు. కరోనాతో రెండేళ్లుగా 'ఆన్‌లైన్' క్లాసులే..గత రెండు సంవత్సరాలుగా కరోనా వైరస్ ప్రభావంతో ఆన్‌లైన్ క్లాసులే ఎక్కువగా జరుగగా, ప్రత్యక్ష బోధన తక్కువగానే ఉంది. దీంతో గత రెండేళ్లుగా పదో తరగతిలో ఇంటర్నల్ మార్కు ల ఆధారంగా గ్రేడింగ్ ఇవ్వటంతో ఎక్కువ మంది విద్యార్థులకు 10/10 జీపీఏ రాగా, వందశాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ విద్యాసంవత్సరం సెప్టెంబరు 1 నుంచి పాఠశాలలు ప్రారంభమై ప్రత్యక్ష బోధన జరిగింది. అలాగే సిలబ్‌సను కొంత వరకు ప్రభు త్వం తగ్గించింది. గతంలో ప్రతీ సబ్జెక్టులో పేపర్–1, పేపర్– 2గా ఉండేవి.. కానీ, ఈసారి ప్రతీ సబ్జెక్టుకు ఒకే పేపర్‌గా మార్చి పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం టైం టేబుల్‌ను విడుదల చేసింది. మే 6 నుంచి 12 వరకు ప్రీ ఫైనల్, మే 23 నుంచి జూన్ 1 వరకు వార్షిక పరీక్షలు నిర్వహించేందుకు రాష్ట్రప్రభుత్వం ఏర్పా ట్లు చేస్తోంది. ఈ నేపథ్యంలో విద్యార్థుల కోసం విద్యావేత్తలను సంప్రదించి పరీక్షలంటేనే భయంగా భావించే వారు సైతం సునాయసంగా సన్నద్ధమయ్యేందుకు 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం అందిస్తోంది.పరీక్ష సమయం కీలకమైంది..ఏడాది మొత్తం అన్ని పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థి.. వార్షిక ఎగ్జామ్‌ల్లో మాత్రం యావరేజ్ మార్కులకు పరిమితమవుతుంటారు. అందుకు కారణం ఒత్తిడి. దీనిని అధిగమించాల్సిన సమయం ఆసన్నమైంది. పబ్లిక్ పరీక్షలంటే విద్యార్థులకు భయం ఉంటుంది. ఎన్ని ఎగ్జామ్స్ రాసినా ప్రతీ పరీక్ష కొత్తగానే అనిపిస్తుంది. పరీక్షల సమయంలో మానసిక ఒత్తిడికి గురవుతూనే ఉంటారు. దీంతో చదివింది కాస్త పరీక్ష కేంద్రాల్లో గుర్తు కు రాక, జవాబులు రాయలేక మార్కులు కోల్పోతుంటారు. అందుకే ఒత్తిడిని. భయాన్ని వీడి అధిగమించాలి. ఈ నేపథ్యంలో విద్యార్థులు ఈ కీలక సమయాన్ని ఉ పయోగించుకోవాలి.

మార్కుల కోసం ఒత్తిడి వద్దు..మార్కులు బాగా రావాలని తల్లిదండ్రులు చేసే.. ఆ ఒత్తిడే విద్యార్థుల చేత తప్పులు చేయిస్తుంది. పరీక్షల సమయంలో విద్యార్థులకు ఇంట్లో మంచి వాతావరణం ఉండాలి. తల్లిదండ్రులు బలవంతంగా తమ అభిప్రాయాలను విద్యార్థులపై రుద్దడం వల్ల మానసిక స్థైర్యం కోల్పోయే ప్రమాదం ఉంది. అత్యుత్తమ మార్కులు సాధిస్తే బహుమతులు కొనిస్తామంటూ ప్రోత్సహించాలి.

పునశ్చరణ తప్పనిసరి..సిలబ్‌సలు పూర్తి కావడంతో పునశ్చరణ తరగతులు ఇప్పుడు విద్యార్థులకు చాలా ఆవశ్యం. కొంతమంది పరీక్షలకు ముందు బాగా చదువుతారు. అయితే ఎగ్జామ్ హాల్‌లోకి వెళ్లగానే చదివింది మరిచిపోతుంటారు. పరీక్షలే కీలకం కావడంతో ఈ పునశ్చరణ పద్ధతిని అవలంభించాలి. చదివినవన్నీ గుర్తుకు తెచ్చుకోవాలి, ఏదీ మరిచిపోయాం, ఎందుకు మర్చిపోయామో గమనించాలి. ఏ సబ్జెక్ట్‌ల్లో ఎన్ని మార్కులు వస్తాయో ముందుగానే అం చనాకు రావాలి. ఈ మేరకు పరీక్షలకు మానసికంగా సిద్ధం కావాలి.

పూర్తి ఆత్మవిశ్వాసంతో వెళ్లాలి..పరీక్ష హాల్‌లోకి సంపూర్ణ ఆత్మవిశ్వాసంతో వెళ్లాలి. భయం, ఒత్తిడితో సమయం వృథా చేయొద్దు. ప్రశ్నాపత్రాలను పరీక్షించా లి. తెలిసిన ప్రశ్నలన్నింటికి ముందుగా జవాబులు రాయాలి. ఆ తర్వాత సందేహం ఉన్న ప్రశ్నలకు జవాబులు రాసేందుకు ఉపక్రమిస్తే కొంత ఒత్తిడి తగ్గడంతో పాటు సమయం సరిపోతోంది.

చదువుకు టైం టేబుల్ తయారు చేసుకోవాలి..ప్రణాళికతో విద్యనభ్యసించడానికి పక్కా టైం టేబుల్‌ను తయారు చేసుకోవడం తప్పనిసరి. ఏ సబ్జెక్టుకు ఎంత సమయం కేటాయించాలో ముందుగానే నిర్ధారించుకోవాలి. బలాలు, బలహీనతలను నిజాయితీగా ఒప్పుకొని, బలహీనతలను అ?ధిగమిం చే ప్రయత్నం చేయాలి. మాక్ టెస్టులు ఎక్కువగా రాస్తే పరీక్షలపై ఉన్న భయం పోతుంది. లెక్కలు, ఫిజిక్స్ సూత్రాలు, కెమిస్ట్రీలోని ఫార్ములాలు ఎప్పటికప్పుడు చూసుకోవాలి. ఇంగ్లీష్ గ్రామర్‌పై ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టాలి. రోజుకు ఓ పేరా అయినా ప్రాక్టిస్ చేయాలి. మార్కులపై కాకుండా సబ్జెక్టుపై ప్రధానంగా దృష్టి సారించాలి. పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన సీనియర్‌ల వద్ద నుంచి సూచనలు, సలహాలు తీసుకోవాలి.

ఆహారంలోనూ జాగ్రత్తలు..పరీక్షల సమయంలో ఆహారపు అలవాట్లలో నూ జాగ్రత్తలు పాటించాలి. ఇష్టం వచ్చిన ఆహారం తినడంతో ఆరోగ్య సంబంధమైన సమస్యలు తలెత్తే అవకాశాలు లేకపోలేదు. ఆకుకూరలు, పాలు, చేపలు తినాలి. నూనె పదార్థాలకు దూరంగా ఉండాలి.

నిద్రలేమి మంచిది కాదు..బాగా తినాలి.. బాగా చదవాలి.. బాగా పరీక్షలు రాయాలి. ఈ మూడు అంశాలను విద్యార్థులు దృష్టిలో పెట్టుకోవాలి. అంత వరకు బాగానే ఉన్నా పరీక్షల్లో బాగా రాయాలని, సమయపాలన లేకుండా చదవడం కూడా సరికాదు. నిద్రలేమితో మానసిక ప్రశాంతత దెబ్బతినే అవకాశాలున్నాయి.

శ్రమిస్తే ఉత్తమ గ్రే డ్ల సాధన కష్టమేమీ కాదు..: వి.గురునాథరావు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, కంబాలపల్లి కష్టంగా ఉన్న సబ్జెక్టుకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. పరీక్షల భయం పోవాలంటే వారికి వారే పరీక్ష పెట్టుకోవాలి. పరీక్ష హాలు లో ఉన్నట్లు ఊహించుకోవాలి. చదివే సమయంలో ప్రతీ గంటకు ఒకసారి ఐదు నిమిషాలు రిలాక్స్ కావాలి. 15 నిమిషాలైనా రోజూ ధ్యానం చేస్తే మంచి ఫలితాలు సొంతమవు తాయి. అత్యుత్తమ గ్రేడ్‌లు సాధించే అవకాశాలు మెండుగా ఉ ంటాయి.ఇంటర్, టెన్త్ పరీక్షలు పక్కాగా నిర్వహించాలి : కలెక్టర్ : ఇంటర్, ఎస్సెస్సీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సమావేశ మందిరంలో ఇంటర్మీడియేట్, పదో తరగతి పరీక్షల నిర్వాహణపై అధికారులతో సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలు మే 6 నుంచి 19 వరకు, పదో తరగతి మే 23 నుంచి జూన్ ఒకటి వరకు వార్షిక పరీక్షలు నిర్వహించేందుకు పక్కా ఏర్పాట్లు చేయాలన్నారు. ఇంటర్‌కు జిల్లాలో 19 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, ప్రథమ సంవత్సరం 6033 మంది, ద్వితీయ సంవత్సరం 5611 మంది వెరసీ మొత్తం 11644మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని చెప్పారు. ఎస్సెస్సీకి 56 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, 9,289 మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు.



# ఆరేళ్లయినా.. అర ఎకరం తడవలే!

ఆదిలాబాద్ : లోయర్ పెన్ గంగా ప్రాజెక్టులో భాగంగా కోర్టా – చనకా బ్యారేజీ నిర్మాణం పనులు చేపట్టి ఆరేళ్లయినా అరకం భూమి కూడా తడవలేదు. మహారాష్ట్ర, జిల్లా సరిహద్దుల్లో పెన్‌గంగా నదిపై నిర్మిస్తున్న కోర్టా – చనకా బ్యారేజీ పనులకు నిధుల కొరత ఆటంకంగా మారుతోంది. ఆరేళ్ల క్రితం రూ.386కోట్ల అంచనా వ్యయంతో లోయర్ పెన్‌గంగా ప్రాజెక్టు పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ఐదు సార్లు పనుల గడువు సమయాన్ని పొడగించారు. ప్రతి యేటా పెన్‌గంగా నదికి భారీ వరదలు రావడంతో పనులను అర్ధాంతరం గానే నిలిచి పోతున్నాయి. బ్యారేజీ నిర్మాణం, హత్తిఘాట్ పంప్‌హౌస్ పనులు దాదాపుగా పూర్తి దశకు చేరుకున్న కాలువల నిర్మాణం పనుల్లో జాప్యం జరుగుతోంది. మే చివరి నాటికి పంప్‌హౌస్ డ్రై రన్ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్న ఆయకట్టుకు సాగునీరు అందడం అనుమానంగానే కనిపిస్తోంది. ఇటీవల సీఎంవో స్మితా సబర్వాల్ పర్యటించి పనుల్లో వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించిన భూసేకరణ తీవ్ర సమస్యగా మారుతోంది. ప్రధానంగా నిధుల విడుదలలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోంది. సీఎం కేసీఆర్ మూడేళ్ల క్రితం కో ర్టా–చనకా బ్యారేజీని సందర్శించి పనులను మరింత వేగ వంతం పెంచాలని సంబంధిత అధికారులతో పాటు కాం ట్రాక్ట్ కంపెనీలను హెచ్చరించారు. అయినా పనులు ఊపందుకోవడమే లేదు. దీంతో ఈ యేడు కూడా ఆయకట్టుకు సాగునీరు అందించడం అనుమానంగానే కనిపిస్తోంది. నిలిచి పోయిన కాలువల నిర్మాణంప్రధానంగా కాలువల నిర్మాణం పనులు పూర్తయితేనే ఆయకట్టుకు సాగునీరు అందే అవకాశం ఉంది. కానీ భూసేకరణ ప్రధాన సమస్యగా మారుతోంది. ఇప్పటికే సర్వే పనులను చేపట్టిన ప్రభుత్వం నిధులను మంజూరు చేయక పోవడంతో అర్ధాంతరంగానే నిలిచి పోయింది. మరో రెండు మాసాల్లో వర్షాకాలం ముంచుకొస్తుం డడంతో పనులకు ఆటంకం కలిగే అవకాశం ఉంది. దీంతో కాలువల నిర్మాణం పనులు ముందుకు సాగడం కష్టంగానే కనిపిస్తోంది. అసలే నల్ల రేగడి నేలలు కావడంతో చిన్న పాటి వర్షాలకే బురదమయమై పనులకు ఇబ్బందులు ఎదురుకానున్నాయి. ప్రధాన, ఉపకాల్వల పనులు పూర్తిగా నిలిచి పోయే ప్రమాదం ఉంది. ఒక వేళ బ్యారేజీ, హత్తిఘాట్ పంప్‌హౌస్ పనులు పూర్తయిన కాల్వల పనులు పూర్తికాక పోవడంతో ఎలాంటి ప్రయోజనం ఉండదంటున్నారు. ఇప్పటికే పంపుమోటార్లను బిగించిన చిన్న పాటి మరమ్మతులు కొనసాగుతున్నా యి. మేలో పంపులను డ్రై రన్ చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. కానీ కాల్వల నిర్మాణం పూర్తికాక పోవడంతో ఆయకట్టుకు సాగునీరు అందడం కష్టంగానే కనిపిస్తుంది. ఒక వేళ మోటార్ పంపుసెట్లు డ్రైరన్ పూర్తయిన కాల్వల నిర్మాణం పనులు పూర్తికాకుంటే ఎలాంటి ప్రయోజనం ఉండదంటున్నారు.అంచనా వ్యయం పెంచినా.. అంతే సంగతికోర్టా – చనకా బ్యారేజీ నిర్మాణం పనులకు రాష్ట్ర ప్రభుత్వం అంచనా వ్యయాన్ని పెంచిన పనుల్లో పురోగతి కనిపించడం లేదు. మొదట రూ.386కోట్ల అంచనా వ్యయంతో బ్యారేజీ నిర్మాణం పనులను చేపట్టింది. ఇటీవల రూ.765కోట్లకు అంచనా వ్యయాన్ని పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక జీవోను జారీ చేసింది. ఇందులో దుమ్ముగూడెం నుంచి తరలించిన మోటార్ పంపుల విలువ రూ.110 కోట్లు, సబ్‌స్టేషన్, విద్యుత్ టవర్ లైన్‌ల పనుల కోసం రూ.60కోట్లు, 12శాతం జీఎస్టీ, పెరిగిన ధరల విలువ, మహారాష్ట్ర వైపు నిర్మించాల్సిన పనులకు నిధుల కేటాయింపు, ప్రభుత్వ డిపాజిట్లు, పంపుమోటార్‌ల డిజైన్ మార్పు, గేట్ల సామర్థ్యం పెంపు లాంటి పనులకు అంచనా వ్యయాన్ని పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సుమారుగా రూ.170కోట్ల నిధులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఇప్పటి వరకు చేపట్టిన పనులకు గాను రూ.50కోట్లు, విద్యుత్ టవర్ పనులకు రూ.20కోట్లు, మరో రూ.100 కోట్లు భూసేకరణకు చెల్లించాల్సి ఉందని అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తోంది. ఇన్నాళ్లు బిల్లుల కోసం ఎదురు చూడకుండానే ఎలాగో పనులు చేపట్టిన కాంట్రాక్ట్ కంపెనీలు బిల్లులకు సంబంధించిన నిధుల విడుదలలో ప్రభుత్వం తీవ్ర జాప్యంచేయడంతో ఇక చేసేది లేక చేతులెత్తేస్తున్నారు. పెండింగ్ బిల్లుల కోసం నెలల తరబడి హైదరాబాద్‌లోనే మకాం వేసి ప్రయత్నాలు చేసినా నయా పైసా కూడా విడుదల కావడం లేదంటున్నారు. మేలో డ్రైరన్ నిర్వహిస్తాం..– శ్రీనివాస్‌రెడ్డి లోయర్ పెన్‌గంగా చీఫ్ ఇంజనీర్ఇప్పటికే బ్యారేజీ నిర్మాణం పనులు దాదాపుగా పూర్తియినట్లే. చిన్నపాటి మరమ్మత్తులు చేపట్టి నీటిని నిల్వ చేసేందుకు సిద్ధం చేస్తాం. ప్రధానంగా భూసేకరణ పనులు చేపట్టాల్సి ఉంది. దీంతో కాలువల పనులు ముందుకు సాగడం లేదు. కొనసాగుతున్న పనులకు కొంత వరకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఇప్పటికే ప్రభుత్వం అంచనా వ్యయాన్ని పెంచడంతో పనులను వేగవంతంగా పూర్తి చేయాలని లక్ష్యం పెట్టుకున్నాం. మే చివరి నాటికి పంపుహౌస్ పనులను పూర్తి చేసి డ్రైరన్ నిర్వహిస్తాం. వచ్చే జూన్, జూలైలో పంపుల ద్వారా నీటిని ఎత్తి పోసే ప్రక్రియ ప్రారంభమవుతుంది.

# వడి వడిగా మండపం పనులు

హనుమకొండ : దశాబ్దకాలంగా నత్తనడకన సాగుతున్న హనుమకొండ వేయిస్తంభాలగుడి కల్యాణ మండపం పునరుద్ధరణ పనుల్లో వేగం పెరిగింది. రూ.7.50కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన మండపం పనులు నిధుల కొరత వల్ల ఇన్నాళ్లు మందకొడిగా సాగుతూ వచ్చాయి. స్థపతికి బిల్లులు చెల్లించకపోవడంతో దాదాపు రెండున్నరేళ్ల పాటు నిలిచిపోయాయి. కేంద్ర ప్రభుత్వం బిల్లులు చెల్లించడంతో పనుల్లో వేగం పెరిగింది.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చొరవకేంద్ర సాంస్కృతిక వ్యవహారాల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి మండపం పనులపై దృష్టి సారించారు. స్థపతికి రావాల్సిన బిల్లులను చెల్లించేట్టు చూస్తానని భరోసా ఇవ్వడంతో నాలుగు నెలలుగా పనులు వేగంగా పుంజుకున్నాయి. ఇప్పటికే మూడుసార్లు మండపాన్ని సందర్శించారు. పనుల ప్రగతిని ప్రత్యక్షంగా పరిశీలించారు. వీలైనంత త్వరగా పూర్తి చేయాల్సిందిగా ఒత్తిడి తీసుకువస్తున్నారు. నగరానికి వచ్చిన కిషన్‌రెడ్డి మరోమారు వేయిస్తంభాల గుడిని సందర్శించి మండపం పనులను పరిశీలించారు. డిసెంబర్ లోగా ఎట్టిపరిస్థితుల్లో పూర్తి చేయాలని స్థపతిని కోరారు. మండపం పనుల సత్వర పూర్తితో పాటు వేయిస్తంభాలగుడి ప్రాంగణం సుందరీకరణకు, ఇతర అభివృద్ధి పనులకు రూ.15కోట్లు మంజూరు చేసినట్టు ప్రకటించారు. నిధులు అందుబాటులోకి రానుండడంతో పునరుద్ధరణ పనులు మరింత వేగం పుంజుకోనున్నాయి.

పైకప్పు పనులుమండపం పైకప్పు పనులు మే మొదటి వారంలో ప్రారంభం కానున్నట్టు స్థపతి బాలక్రిష్ణన్ శివకుమార్ తెలిపారు. మే 1వ తేదీన 50 టన్నుల సామర్థ్యం కలిగిన భారీ క్రేన్‌ను వినియోగంలోకి తెస్తున్నట్టు తెలిపారు. ఈ క్రేన్ సహాయంతో స్తంభాలు, అడ్డ బీములను పైకి ఎత్తి కప్పుపై భాగాన అమర్చుతారు. పునరుద్ధరణ పనుల్లో ఇదే కీలకఘట్టం. చివరి పని కూడా. అత్యంత సంక్లిష్టమైన ఈ పనిని పూర్తి చేస్తే మండపం పనులు దాదాపు పూర్తయినట్టే. ఇప్పటివరకు 75 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన 25 శాతం పనుల్లో పైకప్పు నిర్మాణంతో పాటు మరికొన్ని పనులు పూర్తి చేయాల్సి ఉంది. పైకప్పులో అమర్చే అడ్డ బీములు, నిలువు బీముల్లో కొన్ని లేవు. వీటి స్థానంలో కొత్తవాటిని తయారు చేస్తున్నారు. ఇందుకు అనువైన, అదే రంగు కలిగిన రాయిని ఉర్సుగుట్ట సమీపంలోని అమ్మవారిపైటలోని క్వారీ నుంచి సేకరిస్తున్నారు. ముడిరాయిని మండపం వద్దకు తీసుకువచ్చి ఆవరణలోనే శిల్పులు చెక్కుతున్నారు. ఈ పని రెండు మూడు నెలల్లో పూర్తవుతుంది.

ఇప్పటి వరకు..కల్యాణ మండపంలో అత్యంత ముఖ్యమైన బేస్‌మెంట్ పని ఇది వరకే పూర్తయింది. బేస్‌మెంట్ పునర్నిర్మాణంలో కాకతీయులు అనుసరించిన సాండ్‌బాక్స్ టెక్నాలజీనే వినియోగించారు. ఇసుక అధారంగా పునాది నిర్మాణం జరిగింది. దీనిపై ప్రదక్షిణపాద కక్ష్యాసనం కూడా పూర్తయింది. ఇటీవల దక్షిణం వైపు మిగిలిపోయిన ప్రదక్షిణపాదాన్ని పూర్తిచేశారు. పిల్లర్లు నిలబెట్టి వాటి ఆధారంగా




నాలుగువైపులా రాతిగోడలను నిర్మించడం కూడా పూర్తయింది. తూర్పు, పడమర, ఉత్తర ద్వారాలను నిలబెట్టారు. ప్రస్తుతం ఒక దక్షిణ ద్వారం మాత్రమే మిగిలి ఉంది. పనులు చేసే క్రమంలో దారి కోసం ఇప్పటి వరకు ఈ ద్వారాన్ని నిలబెట్టలేదు. త్వరలో ఈ పని కూడా పూర్తవుతుంది. దక్షిణం వైపు ద్వారాన్ని ఏర్పాటుతో పాటు పైకప్పు పూర్తికి 160 బీములను వినియోగించాల్సి ఉంటుంది. ఇందులో ఇప్పటివరకు 55 బీములను నిలబెట్టారు. మరో 105 బీములు, పిల్లర్లను అమర్చాల్సి ఉంది. వీటిలో 75 పాత బీములు ప్రస్తుతం అమర్చడానికి అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు 30 కొత్తవాటిని కూడా సిద్ధం చేస్తున్నారు. పిల్లర్లలో 16 లోపల, 24 బయట అమర్చాల్సి ఉంది. విరిగిపోయిన 50 బీములను ప్రత్యేక పద్ధతిలో అతికించారు. వీటినికూడా త్వరలో మండపం పునర్నిర్మాణంలో అమర్చుతారు.

పర్యవేక్షణకేంద్ర పురావస్తుశాఖ సూపరింటెండెంట్ స్మితా ఎస్. కుమార్, ఇంటాక్ కన్వీనర్ ప్రొఫెసర్ పాండు రంగారావు, పురావస్తుశాఖ కన్సర్వేషన్ అసిస్టెంట్ మల్లేశం, కేంద్ర పురావస్తు శాఖ ఇంజనీర్ కృష్ణ చైతన్య పునరుద్ధరణ పనులను పర్యవేక్షిస్తున్నారు. మండపానికి పూర్వరూపాన్ని తీసుకువచ్చిన తర్వాత డిసెంబర్ నెలాఖరు నాటికి సందర్శకులకు అందుబాటులోకి రావచ్చునని తెలుస్తోంది. ఈలోగా కేంద్రం ఇచ్చిన రూ.15కోట్లతో వేయిస్తంభాలగుడి సుందరీకరణ పనులను పూర్తి చేస్తారు.

# నాసిన్ చెరువు శుద్ధీకరణ

రంగారెడ్డి : : చెరువుల శుద్ధీకరణకు పూనుకుంది దమ్మాయి గూడ మున్సిపల్ పాలకవర్గం. మురుగునీటితో నిండిన చెరువులను స్వచ్ఛంగా తీర్చిదిద్దే దిశగా అడుగులు వేస్తోంది. దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలో నాసిన్ చెరువు, కోపులకుంట, కుమ్మరికుంట జలాశయాలున్నాయి. దాదాపు 30ఏళ్ల క్రితం వరకు ఆ చెరువుల చుట్టూ ఆయకట్టును ఆ నీటితోనే సాగు చేశారు. పశువుల దప్పిక తీర్చేందుకు ఆ నీటినే వినియోగించేవారు. ఆ చెరువుల్లో పెంచిన చేపలను విక్రయించి మత్స్యకారులు జీవనోపాధి పొందారు. కాగా కాల క్రమేణ దమ్మాయిగూడ నగరానికి చేరువలో ఉండటంతో పెద్దఎత్తున జనాలు ఇక్కడికి వలస వచ్చారు. ఈ తరుణంలో చెరువు పరివాహక ప్రాంతంలో అదే స్థాయిలో కాలనీలు వెలిశాయి. ఈ క్రమంలో ఇళ్ల నుంచి వెలువడిన వ్యర్థజాలాలు చెరువులోకి చేరడంతో మురుగుకూపంగా మారింది. ఆ ప్రాంతమంతా దుర్గంధం వెదజల్లుతోంది. దీనికి తోడు పక్కనే జవహర్‌నగర్ డంపింగ్ యార్డు ఉండటంతో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. దోమల స్వైరవిహారంతో జనాలు తరచూ అంటు వ్యాధులబారిన పడుతున్నారు. ఈ క్రమంలో చెరువును శుద్ధిచేసేందుకు మున్సిపల్ పాలక వర్గం




చర్యలు చేపట్టింది. స్థానికులు మంత్రి మల్లారెడ్డికి మొర పెటుకోగా ఆయన సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. పాలకవర్గ దీక్ష, మంత్రి కృషితో ప్రయత్నం ఫలించింది. మురుగునీరు చెరువులో చేరకుండా ప్రత్యేకంగా భారీ పైపులైను వేసేందుకు హెచ్‌ఎండీఏ ముందుకువచ్చింది. అందుకుగాను రూ.రూ.7.10కోట్లను మంజూరు చేసింది. ఫిబ్రవరి24న మంత్రి చేతుల మీదుగా పనులు ప్రారంభించారు. ముందుగా ఎగువ నున్న దమ్మాయిగూడ చెరువు నుంచి పలు కాలనీల గుండా నాసిన్ చెరువు వరకు వేయాలనుకున్న పైప్‌లైన్ ప్రజల వినతి మేరకు నాగారం మున్సిపాలిటీకి అనుకుని ఉన్న కుమ్మరికుంట వరకు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. చెరువుల్లో మురుగునీరు చేరకుండా చర్యలతో పాటు మినీ ట్యాంక్ బండ్‌గా తీర్చి దిద్దేందుకు ప్రాణాళికా బద్ధంగా ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో మంత్రి మల్లారెడ్డి స్వయంగా పైప్‌లైన్ పనులను పరిశీలించారు. వర్షాకాలం ప్రారంభం నాటికి పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. చెరువు పరిసరాలను సుందరీకరించటతో అహ్లాదవాతావరణం నెలకొంటుందని, స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.రూ.7.10 కోట్లతో పనులు:–వసుపతి ప్రణీత, దమ్మాయి గూడ మున్సిపల్ చైర్‌పర్సన్‌గతంలో శుద్ధ జలాలతో కళకళలాడిన చెరువు నేడు మురికి కూపంగా మారింది. తద్వారా స్థానికులు అనారోగ్యానికి గురౌతున్నారు. ఈ నేపథ్యంలో చెరువును శుద్ధి చేసి, మంచినీటితో నింపేందుకు చర్యలు తీసుకుంటున్నాం. హెచ్‌ఎండీఏ మంజూరు చేసిన రూ.7.10కోట్లతో ప్రత్యేక భారీ పైప్‌లైన్ నిర్మాణాన్ని చేపట్టాం. పనులు చురుకుగా కొనసాగుతున్నాయి.జూన్ మొదటి వారం నాటికి పనులు పూర్తి : – వెంకటేష్, ఏఈఈ, హెచ్‌ఎండీఏ దమ్మాయిగూడలోని నాసిన్ చెరువులో మురుగునీరు మళ్లింపు పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. వర్షాకాలం ప్రారంభం నాటికి (జూన్ మొదటి వారం) పైప్‌లైను నిర్మాణ పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ సంవత్సరం చెరువులో కేవలం వర్షం నీరు చేరేలా చర్యలు తీసుకుంటున్నాం.

# అసైన్డ్ భూములపై రియల్టర్ల కన్ను

రంగారెడ్డి : మండల పరిధిలోని మొండిగౌరెల్లి గ్రామంలో ఉన్న అసైన్డ్‌భూములపై రియల్టర్ల కన్ను పడింది. గుట్టుచప్పుడు కాకుండా భూములు కొనుగోలు చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఎకరానికి రూ.17లక్షలకు కొంటామని రైతులకు ఆశ చూపుతూ అడ్వాన్స్‌లు కూడా ఇచ్చినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. అసలు క్రయవిక్రయాలకు అవకాశం లేని అసైన్డ్ భూములను ఎందుకు కొంటున్నారో ఎవరికీ తెలియడం లేదు. అసైన్డ్ భూములను కొని రిజిస్ట్రేషన్ ఎలా చేసుకుంటారని రైతులు అడిగితే.. అదంతా మేము చూసుకుంటామని రియల్టర్లు సమాధానమిస్తున్నట్లు వదంతులు వినిపిస్తున్నాయి. ఈ విషయం బయటకు రాకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.మొండిగౌరెల్లిలో సర్వే నెంబర్19లో 575ఎకరాల 30 గుంటలు, సర్వే నెంబర్ 68లో 788ఎకరాల 20 గుంటలు, సర్వేనెంబర్ 127లో 122ఎకరాల 22గుంటల అసైన్డ్ భూములున్నాయి. వీటిని కొనుగోలు చేయాలని నగరానికి చెందిన రియల్టర్లు చూస్తున్నారు. రైతులు ఈ భూములను రియల్టర్లకు విక్రయించడం కోసం గ్రామానికి చెం దిన కొందరు వ్యక్తులు ముందుండి వ్యవహారం నడిపిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. అసైన్డ్ భూములు క్రయవిక్రయాలకు తావులేదని ఎవరైనా రైతులు నిలదీస్తే.. వారికి అదనంగా మరో రూ.10వేలు ఇస్తున్నారు. కేవలం మీరు రెవెన్యూ కార్యాలయానికి వచ్చి సంతకాలు పెడితే చాలు.. అంతా తామే చూసుకుంటామని రియల్టర్లు నమ్మిస్తున్నారు. వ్యవసాయాన్ని నమ్ముకొని జీవనం సాగిస్తున్న రైతులను నయానభయాన ఒప్పించి భూములను విక్రయించేలా పైరవీలు చేస్తున్నట్లు తెలుస్తుంది. కొంతమంది రైతులకు టోకన్ డబ్బు కూడా ముట్టినట్లు గ్రామంలో చర్చలు జరుగుతున్నాయి. ఈ భూముల క్రయవిక్రయాలపై ఇటీవల జరిగిన గ్రామసభలో కూడా చర్చ జరిగింది. భూములు క్రయవిక్రయాలు జరిపే వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఇదే విషయమై సర్పంచ్ బి.కృష్ణ వద్ద ప్రస్తావించగా..గ్రామసభలో చర్చకు వచ్చిందన్నారు. ఈ భూములు క్రయవిక్రయాలు జరగరాదన్నారు. ఒకవేళ అలా చేస్తే ప్రభుత్వం పీవోటీ కింద తీసుకుంటుందన్నారు.

అసైన్డ్ భూములు అమ్మితే చర్యలు మొండిగౌరెల్లి గ్రామంలో అసైన్డ్ భూములు క్రయవిక్రయాలు జరిపితే తగు చర్యలు తీసుకుంటాం. ఈ భూములపై ప్రభుత్వానికి అన్ని హక్కులున్నాయి. అసైన్డ్‌భూములకు రిజిస్ట్రేషన్ చేసే అధికారం మాకు లేదు. ఈ భూములను రాష్ట్ర ప్రభుత్వం తమ అవసరాలకు ఎప్పుడైనా తీసుకునే అధికారముంటుంది. అందుకే క్రయ విక్రయాలు జరపరాదు. – మహమూద్ అలీ, యాచారం తహసీల్దారు




అమరావతి: పాఠశాలలకు వచ్చే విద్యార్థులపై నిరంతరం ట్రాకింగ్ ఉండాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. పిల్లలు పాఠశాలలకు రాకుంటే తల్లిదండ్రులకు మెసేజ్ వెళ్తుందని.. ఇలా ప్రతి విద్యార్థిని ట్రాక్ చేస్తున్నామని సీఎం తెలిపారు. అందుకే డ్రాప్ అవుట్ అనే ప్రశ్నే ఉత్పన్నం కాకుండా అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. దీనిపై ఎప్పటికప్పుడు సమర్థవంతమైన పర్యవేక్షణ జరగాలని అధికారులకు సీఎం సూచించారు. విద్యాశాఖపై సోమవారం ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. వచ్చే విద్యా సంవత్సరంలో విద్యా కానుకపై సీఎం సమీక్షించారు. విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన పుస్తకాల ముద్రణ ముందుగానే పూర్తిచేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీనిపై స్పందించిన అధికారులు మే 15 నాటికి పూర్తి చేసేందుకు అన్ని రకాలుగా సిద్ధమవుతున్నామని తెలిపారు. సబ్జెక్టు టీచర్లపైనా సీఎం సమీక్షించారు. సబ్జెక్టు టీచర్లకు ఐఐటీ మద్రాస్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్ కోర్సుల ఏర్పాటుకు సీఎం జగన్ అనుమతిచ్చారు. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబెక్టుల్లో బోధనా పద్ధతుల్లో నైపుణ్యాలను పెంచేలా కోర్సు ఉంటుందని.. వచ్చే రెండేళ్లపాటు ఈ సర్టిఫికెట్ కోర్సు కొనసాగుతుందని అధికారులు వివరించారు. పిల్లల సంఖ్యకు తగినట్టుగా సమీక్ష చేసుకుని వారి అవసరాలకు అనుగుణంగా టీచర్లను నియమించాలని సీఎం ఆదేశించారు. ఏటా దీనిపై సమీక్షించుకోవాలని.. ఆ మేరకు మార్పులు, చేర్పులు చేసుకోవాలని నిర్దేశించారు. పిల్లలకు ఎక్కడ కూడా టీచర్లు సరిపోలేదన్న మాట రాకూడదన్నారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ (ఐఎఫ్‌పీ) ఏర్పాటుపై సమీక్షించిన జగన్.. జూన్ నాటికి తరగతి గదుల్లో ఐఎఫ్‌పీలు ఏర్పాటు చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్టు అధికారులు వెల్లడించారు. స్కూలు పిల్లలకు టోఫెల్ సర్టిఫికేట్ పరీక్షలపై సీఎం సమీక్షించారు. చిన్నారులకు మూడు దశల్లో టోఫెల్ పరీక్షలు జరపాలని సీఎం జగన్ సూచించారు. ఈ పరీక్షల కోసం విద్యార్థులను, టీచర్లను సన్నద్ధం చేసేలా ఇ-కంటెంట్ రూపొందించాలని సీఎం ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలకు సీబీఎస్ఈ అఫిలియేషన్ పూర్తిస్థాయిలో చేయాలన్నారు. ఇప్పటికే వెయ్యి ప్రభుత్వ పాఠశాలలు అఫిలియేట్ అయ్యాయని, మిగిలిన స్కూళ్లను కూడా అఫిలియేట్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు సీఎంకు తెలిపారు.

## హైదరాబాద్ నుంచి త్వరలో మరో 'వందేభారత్' రైలు.. ఎక్కడికో తెలుసా?!



తెలంగాణ నుంచి మరో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును పట్టాలెక్కించేందుకు రైల్వేశాఖ కసరత్తులు చేస్తోంది! అతి త్వరలోనే హైదరాబాద్ నుంచి కర్ణాటక రాజధాని బెంగళూరు నగరానికి కొత్త రైలును నడపాలని యోచిస్తున్నట్టు సమాచారం. ఏప్రిల్ 8న హైదరాబాద్ పర్యటనకు విచ్చేసిన ప్రధాని నరేంద్ర మోదీ సికింద్రాబాద్-తిరుపతి మధ్య కొత్త వందేభారత్ రైలు ప్రారంభించిన విషయం తెలిసిందే. అయితే, ఈ పర్యటన సందర్భంలోనే హైదరాబాద్ నుంచి బెంగళూరుకు కొత్త వందే భారత్ రైలు నడిపే అంశాన్ని ఇక్కడి భాజపా నేతలతో ప్రస్తావించినట్టు పలు జాతీయ మీడియా సంస్థలు పేర్కొంటున్నాయి. ఏ తేదీన ప్రారంభిస్తారనే అంశంలో మాత్రం ఇంకా ఎలాంటి క్లారిటీ రాలేదు. ఒకవేళ ఇదే కార్యరూపం దాల్చితే మాత్రం తెలంగాణ నుంచి పరుగులు పెట్టే వందే భారత్ రైళ్లలో ఇది మూడోది కానుంది. ఈ కొత్త రైలుకు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వచ్చే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఇప్పటికే కాచిగూడ నుంచి బెంగళూరుకు పలు రైళ్లు సేవలందిస్తుండగా.. 570 కి.మీల దూరాన్ని కనీసం 11గంటల్లో కవర్ చేస్తున్నాయి. అదే, సెమీ హైస్పీడ్ రైలు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ అందుబాటులోకి వస్తే మాత్రం ఆ సమయంలో నాలుగు గంటలు సమయం తగ్గనుంది. ఇప్పటికే సికింద్రాబాద్ నుంచి విశాఖ, తిరుపతికి సర్వీసులందిస్తోన్న వందే భారత్ రైళ్లకు ప్రయాణికులనుంచి విశేష స్పందన లభిస్తోంది. ఇదిలా ఉండగా.. కాచిగూడ నుంచి బెంగళూరుకు వందేభారత్ రైలు నడిపే అంశంపై జనవరిలోనే దక్షిణ మధ్య రైల్వే అధికారులు సూచనలు చేసినట్టు అప్పట్లో వార్తలు వచ్చాయి. దీనికితోడు కర్ణాటక ఎన్నికల నేపథ్యంలో అక్కడి భాజపా నేతలు నూతన వందే భారత్‌రైలు గురించి తమ ప్రచారంలో ప్రస్తావిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. దేశంలో ప్రధానమైన టెక్ హబ్‌లుగా పేర్గాంచిన ఈ రెండు నగరాలను కలుపుతూ ప్రారంభం కానున్న ఈ రైలు అత్యంత ప్రాముఖ్యత సంతరించుకోనుంది. అలాగే, సికింద్రాబాద్ నుంచి మహారాష్ట్రలోని పుణెకు సైతం మరో వందే భారత్ రైలును కూడా నడుపుతారనే టాక్ వినబడుతోంది. దేశంలో ఇప్పటివరకు 13వందే భారత్‌రైళ్లు సర్వీసులందిస్తున్నాయి. ఇప్పటికే సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం, తిరుపతి నగరాలకు రెండు వందే భారత్ రైళ్లు సర్వీసులు అందిస్తున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది జనవరి 14న సికింద్రాబాద్- విశాఖ వందేభారత్ రైలును ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించగా.. ఏప్రిల్ 8న హైదరాబాద్‌కు విచ్చేసినన సందర్భంగా ప్రముఖ ఆధ్యాత్మిక నగరం తిరుపతికి నూతన వందేభారత్ రైలును పచ్చజెండా ఊపి ప్రారంభించిన విషయం తెలిసిందే. అంతేకాకుండా దాదాపు రూ.11వేల కోట్లకు పైగా అభివృద్ధి పనులకు ప్రధాని శంకుస్థాపనలు/ప్రారంభోత్సవాలు చేశారు.





**తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన 'యువగళం' పాదయాత్ర అనంతపురంలోని శింగనమల నియోజకవర్గంలో కొనసాగుతోంది. ఈ సందర్భంగా సోడనంపల్లి క్రాస్ వద్ద లోకేశ్.. గొర్రెల పెంపకందారులను కలిసి వారి కష్టసుఖాలు తెలుసుకున్నారు.**

## ఇద్దరం మంత్రులుగా చేశాం.. వైసీపీ మంత్రికి టీడీపీ సీనియర్ నేత సవాల్

బాపట్ల: మంత్రి మేరుగ నాగార్జునకు టీడీపీ సీనియర్ నేత నక్కా ఆనందబాబు సవాల్ విసిరారు. దళితులు, మైనార్టీల అభివృద్ధిపై చర్చకు రావాలని ఛాలెంజ్ విసిరారు. దమ్ముంటే మంత్రి మేరుగ నాగార్జున చర్చకు రావాలన్నారు. మంత్రి మేరుగ చేసిన దాడులు, దోపిడీ, మోసాలు నిరూపిస్తానని నక్కా ఆనందబాబు సవాల్ విసిరారు. ఇద్దరం సాంఘిక సంక్షేమశాఖకు మంత్రులుగా చేశామన్నారు. ఎవరెవరు ఏమేం చేశామో చర్చిద్దామా? అని నక్కా ఆనందబాబు ప్రశ్నించారు. కాగా టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ఇసుక, మట్టి అడ్డగోలుగా దోచేశాడంటూ సాంఘిక,




సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున మండిపడ్డారు. ఈ మేరకు ఆయన గుంటూరులో మీడియాతో మాట్లాడుతూ.. 'నక్కా ఆనందబాబు బతుకేంటో అందరికీ తెలుసు. నియోజకవర్గంలో జగన్ అన్న కాలనీల్లో ఇళ్లకు అన్ని అనుమతులతో మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. మట్టి తవ్వకాలకు పంచాయతీ తీర్మానాలు, కలెక్టర్ అనుమతులు ఉన్నాయి. నక్కా ఆనందబాబు అక్రమ మట్టి తవ్వకాలు అంటూ హడావిడి చేయడానికి ప్రయత్నించారు. ఆనందబాబుకు ప్రజలే బుద్ధి చెప్పారు. నియోజకవర్గంలో ఏ ఊరు వెళ్లిన ఇలాంటి పరిస్థితి ఉంటుందని' మంత్రి మేరుగ నాగార్జున హెచ్చరించారు.




దిల్లీ: విమానాల్లో ప్రయాణికులు అభ్యంతరకరంగా వ్యవహరిస్తున్న ఘటనలు ఈ మధ్య తరచూ వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా ఎయిరిండియా విమానంలో ఓ ప్రయాణికుడు సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తించాడు. దీంతో అతడిని దించేయడం కోసం విమానం మళ్లీ వెనక్కి వచ్చింది. దిల్లీ నుంచి లండన్ బయల్దేరిన విమానంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. సోమవారం ఉదయం దిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి 225 మంది ప్రయాణికులతో ఓ ఎయిరిండియా విమానం లండన్ బయల్దేరింది. అయితే టేకాఫ్ అయిన కొద్ది సేపటికే ఓ ప్రయాణికుడు విమాన సిబ్బందితో వాగ్వాదానికి దిగాడు. సిబ్బందిపై భౌతిక దాడులకు పాల్పడ్డాడు. దీంతో పైలట్ విమానాన్ని వెనక్కి మళ్లించారు. మళ్లీ దిల్లీ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ చేసి ఆ ప్రయాణికుడిని దించేశారు. ఘటన నేపథ్యంలో ఈ విమానం ఆలస్యమైంది. ఘటనపై ఎయిరిండియా స్పందించింది. "దిల్లీ నుంచి లండన్ బయల్దేరిన ఏఐ 111 విమానం.. ప్రయాణికుడి అభ్యంతరకర ప్రవర్తన కారణంగా కాసేపటికే వెనక్కి రావాల్సి వచ్చింది. మాటలతో, రాతపూర్వకంగా హెచ్చరించినా ఆ ప్రయాణికుడు వినిపించుకోలేదు సరికదా.. ఇద్దరు క్యాబిన్ సిబ్బందిని గాయపర్చాడు. దీంతో విమానాన్ని దిల్లీకి మళ్లించాలని పైలట్ నిర్ణయించారు. ల్యాండ్ అయిన తర్వాత అతడిని భద్రతా సిబ్బందికి అప్పగించారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాం" అని ఎయిరిండియా తన ప్రకటనలో వెల్లడించింది. విమానంలోని ప్రతి ఒక్కరికి భద్రత కల్పించడం, వారి మర్యాదను కాపాడటం తమకు అత్యంత ప్రాధాన్యమని ఎయిర్‌లైన్ తెలిపింది. ఈ ఘటనతో ఇతర ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి తాము చింతిస్తున్నట్లు పేర్కొంది. విమానాన్ని మధ్యాహ్నానికి రీషెడ్యూల్ చేసినట్లు వెల్లడించింది. ఇటీవల ప్రయాణికుడి మూత్ర విసర్జన ఘటనతో ఎయిరిండియా తీవ్ర విమర్శలపాలైన విషయం తెలిసిందే. విమానంలో ప్రయాణికుల ప్రవర్తనపై పెద్ద చర్చే జరిగింది. ఈ నేపథ్యంలోనే ప్రయాణికుల అనుచిత ప్రవర్తనను ఎదుర్కొనేందుకు ఎయిరిండియా తమ సిబ్బందికి కఠిన మార్గదర్శకాలను జారీ చేసింది.




దిల్లీ: దేశంలో కరోనా మహమ్మారి మళ్లీ చాప కింద నీరులా విస్తరిస్తోంది. గత కొన్ని రోజులుగా కొత్త కేసులు, పాజిటివిటీ రేటు పెరుగుతుండటం కలవరపెడుతోంది. వైరస్ వ్యాప్తి కట్టడికి ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు మళ్లీ నిబంధనలను అమల్లోకి తెచ్చాయి. అటు కేంద్ర ప్రభుత్వం కూడా అప్రమత్తమైంది. కొవిడ్ బాధితులకు చికిత్స అందించే ఆసుపత్రుల్లో సౌకర్యాలపై నేటి నుంచి రెండు రోజుల పాటు మాక్ డ్రిల్ ప్రారంభించింది. కొవిడ్ నిర్వహణ సంసిద్ధతను తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం చేపట్టింది. దేశవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు సోమవారం మాక్ డ్రిల్ మొదలుపెట్టగా.. మంగళవారం కూడా ఈ ప్రక్రియ కొనసాగనుంది. ఆసుపత్రుల్లో పడకల సామర్థ్యం, ఐసోలేషన్, ఆక్సిజన్ వసతి ఉన్న బెడ్‌లు, వెంటిలేటర్, ఐసీయూ బెడ్‌ల వివరాలను ఈ మాక్‌డ్రిల్‌లో సేకరించనున్నారు. అందుబాటులో ఉన్న వైద్య సిబ్బంది, అంబులెన్స్‌ల వివరాలను తెలుసుకోనున్నారు. దీంతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షా కేంద్రాలు, ఆర్టీపీసీఆర్ పరీక్షలు, కిట్ల లభ్యత, పీపీఈ కిట్లు, ఆక్సీమీటర్‌లు, మాస్కులు (ఎన్-95), వెంటిలేటర్ల సంఖ్య వంటి కీలక అంశాలు గుర్తించి వైద్యారోగ్య శాఖకు నివేదిస్తారు. వీటన్నింటిని పరిశీలించి వైరస్‌ను ఎదుర్కొనే సంసిద్ధతపై కేంద్ర వైద్యారోగ్యశాఖ అంచనా వేస్తుంది. హరియాణాలోని ఝుజ్జర్ ఎయిమ్స్‌లో జరిగిన మాక్ డ్రిల్‌ను కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ పరిశీలించారు.

**6శాతం దాటిన పాజిటివిటీ రేటు..** మరోవైపు దేశంలో తాజాగా 5,880 కొత్త కేసులు నమోదయ్యాయి. రోజువారీ పాజిటివిటీ రేటు 6.91శాతానికి చేరడం ఆందోళన కలిగిస్తోంది.

వైరస్ కారణంగా నిన్న 14 మంది ప్రాణాలు కోల్పోయారు. దిల్లీ, హిమాచల్‌ప్రదేశ్‌లో నాలుగు చొప్పున మరణాలు నమోదవ్వగా.. కేరళలో ఇద్దరు, గుజరాత్, మహారాష్ట్ర, రాజస్థాన్, జమ్మూకశ్మీర్‌లో ఒక్కొక్కరు కరోనాతో ప్రాణాలు కోల్పోయినట్లు ఆరోగ్యశాఖ వెల్లడించింది. అటు క్రియాశీల కేసుల సంఖ్య 35,199కి పెరిగింది.




దేశవ్యాప్తంగా ఎల్ఐసీ కార్యాలయాల్లో అప్రెంటిస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(ఏడీవో) ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. జోన్‌ల వారీగా మొత్తం 9,394 ఏడీవో పోస్టులను భర్తీ చేసేందుకు జనవరిలో భారీ నోటిఫికేషన్ జారీ అయిన విషయం తెలిసిందే. వీటిలో సౌత్ సెంట్రల్ జోనల్ ఆఫీస్ (హైదరాబాద్) పరిధిలోనే 1,408 పోస్టులు ఉన్నాయి. ఈ ఉద్యోగాల భర్తీ కోసం మార్చి 12న ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించగా.. సోమవారం జోన్‌ల వారీగా ఫలితాలను పీడీఎఫ్ రూపంలో అందుబాటులో ఉంచారు. ప్రిలిమ్స్ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులంతా ఏప్రిల్ 23న జరిగే మెయిన్స్ పరీక్షను రాయాల్సి ఉంటుంది. మెయిన్‌లోనూ అర్హత సాధించిన అభ్యర్థులకు ఇంటర్వ్యూ, ప్రీ-రిక్రూట్‌మెంట్ మెడికల్ ఎగ్జామినేషన్ పరీక్ష నిర్వహించి ఆ తర్వాత ఉద్యోగాలకు ఎంపిక చేస్తారు. మెయిన్ పరీక్షకు సంబంధించిన అడ్మిట్ కార్డులను త్వరలోనే అందుబాటులో ఉంచనున్నారు.

## విశాఖ ఉక్కు బిడ్డింగ్‌లో తెలంగాణ పాల్గొనడంపై రామకృష్ణ ఏమన్నారంటే..

అమరావతి: విశాఖ ఉక్కు బిడ్డింగ్‌లో తెలంగాణ పాల్గొంటే ఏపీ సీఎం జగన్ మోహన్ రెడ్డికి ఆత్మహత్యే శరణ్యమంటూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ... చిన్న రాష్ట్రం బిడ్డింగ్‌లో చిన్న రాష్ట్రం తెలంగాణ పాల్గొంటే.. జగన్ సంక నాకటానికా? అంటూ విరుచుకుపడ్డారు. తెలంగాణ బిడ్డింగ్‌లో పాల్గొంటే ఆంధ్రప్రదేశ్‌కు అవమానమన్నారు. జగన్‌కు ధైర్యముంటే మోదీ దగ్గరకు వెళ్ళి ఆపాలని.. లేకుంటే దిగిపోవాలని డిమాండ్ చేశారు. ఎందరో బలిదానాలతో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ వచ్చిందని గుర్తుచేశారు. మోదీ ప్రభుత్వం మూర?ంగా మొండిగా విశాఖ ఉక్కు కర్మాగారాన్ని అమ్మాలని చూస్తోందని మండిపడ్డారు. మోదీ, జగన్ కలిసి అదానీకి అప్పగించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. విశాఖ ఉక్కు బిడ్డింగ్‌లో తెలంగాణ పాల్గొంటుందని సీఎం కేసీఆర్ చెప్పారని... చిన్న రాష్ట్రం తెలంగాణ బిడ్డింగ్‌లో పాల్గొంటుంటే జగన్ సంక నాకుతున్నాడా అంటూ వ్యాఖ్యలు చేశారు. అదే జరిగితే జగన్ చరిత్ర హీనుడిగా మిగిలిపోతారన్నారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటే ఆంధ్రా ప్రభుత్వం ఎందుకు ఉన్నట్టు అంటూ రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు.



## 'విశాఖ ఉక్కు'.. కేసీఆర్ నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు: ఏపీ మంత్రి అమర్నాథ్

అమరావతి: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు ఏపీ ప్రభుత్వం వ్యతిరేకమని మంత్రి గుడివాడ అమర్నాథ్ స్పష్టం చేశారు. విశాఖ ఉక్కు.. రాష్ట్ర ప్రజల సెంటిమెంట్ అని వ్యాఖ్యానించారు. లాభనష్టాలు చూడకుండా స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రమే నడపాలన్నారు.

"విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు తాము వ్యతిరేకమని తెలంగాణ సీఎం కేసీఆర్ అన్నారు. తెలంగాణ నుంచి ఇప్పటివరకూ అధికారిక ప్రకటన ఏదీ రాలేదు. సీఎం కేసీఆర్, తెలంగాణ ప్రభుత్వ ప్రకటన లేకుండా ఏం మాట్లాడగలం? కొందరు రాజకీయ విమర్శలు చేసే వాళ్లు ఏవేవో మాట్లాడుతారు. వాటికి జవాబు చెప్పాల్సిన అవసరం మాకు లేదు" అని అమర్నాథ్ అన్నారు.



# ఇంకోక్కటి కావాలట!

బోనీ కపూర్ శ్రీదేవి దంపతుల కుమార్తె జాన్వీ కపూర్ హీరోయిన్గా లాంచ్ అయి చాలా కాలమే అయినప్పటికీ... ఆమెకు చెప్పుకోదగ్గ హిట్టు మాత్రం ఒకటి కూడా లేదు. ఒక మరాఠీ సినిమాని బాలీవుడ్లో రీమేక్ చేస్తూ... దాని ద్వారా ఆమెను హీరోయిన్గా ఎంట్రీ ఇప్పించారు. అయితే ఇప్పటివరకు ఆమె తండ్రి చాటు బిడ్డగానే పెరుగుతూ వచ్చింది. అలాంటి ఆమె ఇప్పుడు ఏకంగా ఎన్టీఆర్ సరసన నటించే అవకాశం దక్కించుకుంది. టాలీవుడ్లో మొదటి ప్రాజెక్టు... అది కూడా ఎన్టీఆర్ సరసన దక్కడం అనేది మామూలు విషయం కాదనే చెప్పాలి. ఇటీవలే కొరటాల శివ ఎన్టీఆర్ కాంబినేషన్లో ప్రారంభమైన ఈ సినిమా ప్రారంభోత్సవానికి కూడా జాన్వీ కపూర్



కూడా హాజరై సందడి చేసింది. ఇక తెలుగులో మొదటి సినిమానే స్టార్ డైరక్టర్ స్టార్ హీరో సినిమాలో నటించే అవకాశం దక్కించుకుంది. కొరటాల శివ దర్శకత్వంలో ఎన్టీఆర్ 30 సినిమా పాన్ ఇండియా రేంజ్ లో ఈ సినిమా విడుదల కానుంది.. యువ సుధ ఆర్ట్స్ ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నాడు. ఇక ఈ సినిమా క్లిక్ అయితే జాన్వీ కి అవకాశాలు క్యు కట్టనున్నాయి. ఇక టాలీవుడ్ లో తన రెండో ప్రాజెక్టు గురించి ఒక ఇంట్రెస్టింగ్ న్యూస్ బయటకు వచ్చింది. తెలుగులో తన రెండో సినిమా కోసం బోనీ కపూర్... నిర్మాత దిల్ రాజు ద్వారా ప్రయత్నాలు గట్టిగానే చేస్తున్నట్లు సమాచారం. ఇక జాన్వీ కపూర్ తన రెండో సినిమా యే హీరోతో చేస్తుందో అనే విషయం ఇంకా కన్ఫర్మ్ కాలేదు. కానీ సన్నాహాలు అయితే చేస్తున్నారు. మరొక్క పాన్ ఇండియా సినిమా అయితే... ఇటు తెలుగుతో పాటు... తమిళ కన్నడ మలయాళ హిందీ భాషల్లో కూడా క్రేజ్ వస్తుంది అని ఆలోచిస్తుంది జాన్వీ. పాన్ ఇండియా మూవీ అయితే బెస్ట్ అని జాన్వీ అనుకుంటుంది. మరి అమ్మడిని ఎవరు ఏ హీరో సెలెక్ట్ చేసుకుంటారో చూడాలి ఇక.

## కియరా రెడ్ హాట్ కిల్లర్ లుక్

టాలీవుడ్ బాలీవుడ్ లో క్రేజీ హీరోయిన్ గా ఓ వెలుగు వెలుగుతోంది కియరా అద్వాణీ. ఇప్పుడు ఆస్కార్ విన్నింగ్ ఆర్.ఆర్.ఆర్ నటుడు.. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సరసన శంకర్ దర్శకత్వం వహిస్తున్న 'గేమ్ ఛేంజర్'(ఆర్.సి 15) లోను నటిస్తోంది. ఈ సినిమాతో కియరా పాన్ ఇండియా స్టార్ డమ్ ని అందుకోనుంది. తనకు తానుగానే గేమ్ ఛేంజర్ గా దూసుకుపోయేందుకు ఇంకెంతో సమయం లేదని అభిమానులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే అసాధారణ స్టార్ డమ్ ని ఆస్వాధిస్తూ నేటితరం నాయికల్లో క్రేజీ ఎర్నర్ గా గుర్తింపు తెచ్చుకున్న కియరా ఒక్కో సినిమాకి 3-4 కోట్లు వసూలు చేస్తోంది. హిందీ పరిశ్రమలో పారితోషికం పరంగా మరో మెట్టు పైనే ఉందని తెలిసింది. అలాగే సోషల్ మీడియా పోస్టింగులతోను నిరంతరం బజ్ క్రియేట్ చేస్తున్న కియరా ఈ వేదికలపైనా యాడ్ పోస్టింగులతో భారీగా ఆర్జిస్తోంది. మరోవైపు కియరా నిరంతరం కిల్లర్ హాట్ ఫోటోషూట్లతో కుర్రకారు మతులు చెడగొడుతోంది. తాజాగా కియరా రెడ్ హాట్ లుక్ ని షేర్ చేయగా అది అంతర్జాలంలో సునామీ స్పీడ్ తో దూసుకుపోతోంది. రెడ్ థై స్లిట్ మఖమల్ డిజైనర్ ఫ్రాకులో కియరా



టూ హాట్ గా కనిపిస్తోంది. నిజానికి థై స్లిట్ ఎలివేషన్ ఇదే తొలిసారి కాదు. కానీ ఈసారి సంథింగ్ స్పెషల్ గా టూహాట్ గా కియరా కనిపిస్తోందంటూ అభిమానులు కితాబిచ్చేస్తున్నారు. ఈ ఫోటోలను జోరుగా వైరల్ చేస్తున్నారు. ఇక ఇటీవలే తన ప్రియుడు సిద్ధార్థ్ మల్హోత్రాని పెళ్లాడేసిన కియరా పెళ్లి తర్వాత జీవితం ఎలా ఉంది? అని ప్రశ్నించగా.. దానికి ఆసక్తికర సమాధానమిచ్చారు. సిద్ధార్థ్ మల్హోత్రా - కియారా అద్వానీ ఇటీవల ముంబైలో జరిగిన ఒక అవార్డుల కార్యక్రమంలో తమ చిత్రాలలో అత్యుత్తమ నటనకు ట్రోఫీని సొంతం చేసుకున్నారు. అనంతరం కియారా అద్వానీని ముంబై విమానాశ్రయంలో ఒక ఫోటోగ్రాఫర్ "మేడమ్ ఆప్ కీ మ్యారేజ్ లైఫ్ కైసీ హై?" అని అడిగారు. కియారా మొదట్లో హాయిగా ఉందనే ఎక్స్ ప్రెషన్ ఇచ్చింది. కెమెరా వైపు తన ముఖాన్ని తిప్పి గేట్ నుండి ప్రవేశించే ముందు "సబ్ సాహీ హై" అని చెప్పింది. షేర్షా-భూల్ భూలైయా 2-జుగ్ జగ్ జియో -గోవింద నామ్ మేరా లాంటి చిత్రాలలో తన నటనకు కియారా స్టార్ ఆఫ్ ది ఇయర్ అవార్డును అందుకోగా.. షేర్షాలో తన పాత్రకు సిద్ధార్థ్ ఉత్తమ నటుడి అవార్డును అందుకున్నాడు. ఈ జంట షేర్షా షూటింగ్ సమయంలో ప్రేమలో పడ్డారు. ఆ తర్వాత పెళ్లి బంధంతో ఒకటయ్యారు. ఇప్పుడు మళ్లీ కెరీర్ పరంగా ఎవరికి వారు బిజీ అయిపోయారు. 2023 ఫిబ్రవరి 7 న జైసల్మేర్ - సూర్యగఢ్ ప్యాలెస్ లో వివాహం జరిగింది.




# ఆ స్టార్ హీరోని పీసీ ఇంకా మర్చిపోలేదా?




గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా సీటాడెల్ ప్రమోషన్ లో భాగంగా ఎన్నో వ్యక్తిగత విషయాలు షేర్ చేసుకుం టోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే బాలీవుడ్ సినిమాలపై తనదైన శైలిలో స్పందించి అగ్ని పర్వతంలో మండుతోన్న బాధని లావా రూపంలో బయటకు తెచ్చింది. ఆవెంటనే చన్నీళ్లు చల్లేసి గతం గతహా అనేసింది. దీనిపై రెండు..మూడు రోజులు చర్చ సాగినా తర్వాత అంతా కామ్ అయిపోయారు.

ఈ నేపథ్యంలో తాజాగా ఓ జాకెట్ సీక్రెట్ రివీల్ చేసి మరోసారి మీడియాలో మంట పుట్టించింది. ప్రమోషన్ లో భాగంగా ఓ టీవీ కార్యక్రమానికి హాజరైన పీసీ లెదర్ జాకెట్ లో ప్రత్యక్షమైంది. జాకెట్ బాగుందంటూ యాంకర్ సరదాగా ముచ్చటించింది. దీంతో పీసీ పాత మధుర జ్ఞాపకాల్లోకి జారిపోయింది. ఈ జాకెట్ ఎంతో స్పెషల్. ఇది నా ఎయిర్ పోర్ట్ జాకెట్. నా ఎక్స్ బోయ్ ఫ్రెండ్ ఇచ్చాడు. అతను నా నుంచి వెళ్లిపోయినా ఈ జాకెట్ మాత్రం నాగ్గరే ఉందంది. ఇంకా ఆ బోయ్ ఫ్రెండ్ టచ్ లో ఉన్నాడా? అని ప్రశ్నించగా ఉంటే బాగుండు అనే అర్థం వచ్చేలా స్పందించింది. దీంతో ఆ జాకెట్ స్టోరీ ఏమై ఉంటుందా? అని బాలీవుడ్ మీడియా తవ్వి తీసే ప్రయత్నాలు మొదలు పెట్టింది. దీనిలో భాగంగా గతంలో షారుక్ ధరించిన నల్లటి జాకెట్ ఫోటోలు వైరల్ అయ్యాయి.

దీంతో పాత కహనీలు మళ్లీ వెలుగులోకి వస్తున్నాయి. షారుక్-ప్రియాంక చోప్రా మధ్య అప్పట్లో రిలేషన్ షిప్ నడిచినట్లు పెద్ద ఎత్తున ప్రచారం సాగిన సంగతి తెలిసిందే. షారుక్ కారణంగా అతని వైఫ్ గౌరీఖాన్ పీసీకి అవకాశాలు లేకుండా చేస్తున్నారనే వార్తలు హాట్ టాపిక్ గామారినవే. అయితే అప్పటికే పీసీ స్టార్ హీరోయిన్ గా ఎదగడంతో? గౌరీఖాన్ రాజకీయాలు పెద్దగా వర్కౌట్ కాలేదని వినిపించింది. ఇది కొన్ని దశాబ్దాల క్రితం జరిగింది. తాజాగా పీసీ ధరించిన జాకెట్ కారణంగా ఆ విషయాలన్ని మళ్లీ వెలుగులోకి వస్తున్నాయి. మరి ఆ జాకెట్ నిజంగా షారుక్ ఇచ్చిందా? లేక మరో స్టార్ హీరోతో ఉన్న బాండింగ్ ? అన్నది తెలియాలి. మరి సీటాడెల్ రిలీజ్ అయ్యేలోపు పీసీ ఇంకెన్ని బాంబ్ లు పేల్చుతుందో చూడాలి.

# అల్లరి నరేష్ ఉగ్రం.. ఇలాంటి సాంగ్ ఊహించలేదు




ఒకప్పుడు ఎక్కువగా కామెడీ చిత్రాల్లోనే కనిపించి మెప్పించిన హీరో అల్లరి నరేష్.. సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేసినప్పటి నుంచి వినూత్న చిత్రాలతో దూసుకుపోతున్నారు. తాజాగా ఆయన హీరోగా నటించిన చిత్రం ఉగ్రం. ఈ చిత్రానికి తూమ్ వెంకట్ కథను అందిస్తుండగా... అబ్బూరి రవి డైలాగ్స్ కూడా రాస్తున్నారు. షైన్ స్క్రీన్ బ్యానర్ పై సాహు గారపాటి హరీష్ పెద్ది ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. అలాగే ఈ సినిమాకు విజయ్ కనకమేడల దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ చరణ్ పాకాల బ్యాక్ గ్రౌండ్ స్కోర్ మ్యూజిక్ ఈ సినిమాకు ప్లస్ కాబోతున్నాయి. అయితే ఇటీవలే ఈ చిత్రానికి సంబంధించిన దేవేరి వీడియో సాంగ్ ను ఇటీవలే విజయ్ దేవరకొండ విడుదల చేశారు. అయితే తాజాగా చిత్రబృందం మరో సాంగ్ ను విడుదల చేయబోతోంది. అయితే ఈ సాంగ్ కు సంబంధించి ఓ టీజర్ ను నేడు రిలీజ్ చేసింది. అందులో అల్లరి నరేష్ మిర్ణా మీనన్.. బీచ్ లో చాలా స్టైలిష్ గా కనిపిస్తున్నారు. ముందు బేబీ ఊహా రెడ్డిని చూపిస్తూ.. ఆ తర్వాత బీచ్ దగ్గర మిర్ణా ఉయ్యాలలో ఊగుతూ కనిపించింది. ఓ వైపు నుంచి అల్లరి నరేష్ స్టైలిష్ గా నడుచుకుంటూ వచ్చి మిర్ణా దగ్గర ఆగుతాడు. వెనకాల బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ అదిరిపోయింది. అయితే ఆల్బెల.. ఆల్బెల.. అంటూ సాగే ఈ పాటను ఏప్రిల్ 9వ తేదీ ఉదయం 11.07 గంటలకు విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు. ఈ పాటను భాస్కర భట్ల రాయగా... రేవంత్ శ్రావణ భార్గవిలు పాటను ఆలపించారు. రేపు రిలీజ్ కాబోయే ఈ పాట కోసం అల్లరి నరేష్ ఫ్యాన్స్ తెగ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ సినిమా ఎలా ఉండబోతోందో అని తెగ ఎగ్జైట్ అవుతున్నారు. ఈ చిత్రానికి సిద్దార్థ్ జె సినిమాటోగ్రఫర్ గా వ్యవహరిస్తుండగా.. చోటా కే ప్రసాద్ ఎడిటర్ గా పని చేస్తున్నారు. ఈ సినిమాను మే 5వ తేదీన విడుదల చేసేందుకు చిత్రబృందం ఏర్పాట్లు చేస్తోంది. అలాగే ఈ సినిమాలో సీనియర్ హీరోయిన్ ఇంద్రజ శరత్ లోహితస్వ శత్రు శ్రీనివాస్ సాయి మణికంత వారణాసి నాగ మహేష్ రమేష్ రెడ్డి బేబీ ఊహా రెడ్డిలు నటిస్తున్నారు.

# ప్రియుడితో ఫొటోలు షేర్ చేసిన హీరోయిన్

హీరో సిద్దార్థ్ మరియు హీరోయిన్ అదితి రావ్ హైదరి ప్రేమలో ఉన్నారు అనేది గత కొంత కాలంగా జరుగుతున్న చర్చ. ఇప్పటి వరకు వారు అధికారికంగా ప్రకటించలేదు.. కానీ ఇద్దరు షేర్ చేస్తున్న ఫొటోలు మరియు వీడియోలు చూస్తూ ఉంటే.. ఇద్దరు కలిసి వేడుకలకు హాజరు అవ్వడం చూస్తూ ఉంటే ప్రేమలో ఉన్నారనే నమ్మకం రోజు రోజుకు ఎక్కువ అవుతుందని నెటిజన్స్ అంటున్నారు. తాజాగా అదితి రావ్ హైదరి సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫొటో అందరి దృష్టిని ఆకర్షించింది. ప్రియమైన వారితో అంటూ తాను దిగిన ఫొటోను షేర్ చేయడం ద్వారా మరోసారి సిద్దార్థ్ తో ప్రేమలో ఉన్నట్లుగా చెప్పకనే చెప్పింది. హీరోయిన్ గా అదితి రావ్ ఈమధ్య



చేస్తున్న సినిమాలు చాలా తక్కువే అయినా కూడా ఈ ప్రేమ వార్తల కారణంగా ఎక్కువ వార్తల్లో నిలిచింది. ఇటీవల టాలీవుడ్ కు చెందిన ఒక స్టార్ యొక్క పెళ్లి వేడుకలో కూడా సందడి చేసిన సిద్దార్థ్ మరియు అదితి రావు హైదరి ల యొక్క జోడీ ఆ సమయంలో కూడా అందరి దృష్టిని ఆకర్షించిన విషయం తెల్సిందే. వీరిద్దరి జోడీ బాగుంటుందని కామెంట్స్ చేస్తున్నారు. మహాసముద్రం సినిమా షూటింగ్ సమయంలో వీరిద్దరి మధ్య ప్రేమ వ్యవహారం మొదలు అయ్యిందని కొందరు కామెంట్స్ చేస్తుంటే.. ముందు నుండే వీరి మధ్య వ్యవహారం సాగుతుంది అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. మొత్తానికి వీరిద్దరి ప్రేమ వ్యవహారం గురించి జరుగుతున్న ప్రచారం నిజమే అనే ప్రకటన త్వరలోనే వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## టాప్ లెస్ డ్రెస్ లో థైస్ ఎక్స్ ఫోజ్ చేసి కన్నుల విందు

నాని హీరోగా నటించిన ఆహా కళ్యాణం సినిమా తో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ వాణి కపూర్. తెలుగు లో ఈ అమ్మడు చేసింది ఒకే ఒక్క సినిమా అయినా కూడా అప్పటి నుండి ఇప్పటి వరకు అమ్మడు సోషల్ మీడియాలో ఫొటోలు షేర్ చేసినా.. వీడియోలు షేర్ చేసినా కూడా వైరల్ అవుతూనే ఉంటుంది. తాజాగా మరోసారి నాని హీరోయిన్ వాణి కపూర్ హాట్ ఫొటో షూట్ షేర్ చేసిన అభిమానులతో పాటు అందరిని కూడా షాక్ అయ్యేలా



చేసింది. ఇండస్ట్రీలో అడుగు పెట్టి చాలా సంవత్సరాలు అయింది. ఈ మధ్య కాస్త బిజీగా సినిమాలు చేస్తోంది. ఆకట్టుకునే రూపం ఈ అమ్మడి సొంతం.. అంతే కాకుండా ఫిజిక్ విషయంలో ఈ అమ్మడి తర్వాతే మరెవరైనా అన్నట్లుగా ఉంటుంది. యాక్షన్ సన్నివేశాలకు మోస్ట్ వాంటెడ్ అన్నట్లుగా ఉంటూ.. రొమాంటిక్ సన్నివేశాల్లో ఎలా నటించినా కూడా ఆహా అనిపించే విధంగా ఉండే వాణి కపూర్ ఈ ఫొటోలు చాలా మంది గుండెలకు గుచ్చుకుంటున్నాయి అంటూ కామెంట్స్ వస్తున్నాయి. టాప్ లెస్ సింగిల్ పీస్ డ్రెస్ లో ఈ అమ్మడు థైస్ ను ఎక్స్ పోజ్ చేస్తూ చేసిన ఫొటో షూట్ కు సాధారణంగానే అంతా కూడా ఫిదా అవ్వాల్సిందే. అలాంటిది వాణి కపూర్ వంటి అందాల ముద్దుగుమ్మ షేర్ చేస్తే ఇంకా ఏమైనా ఉందా అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.



## సిరిసిల్ల జిల్లాలో మంత్రి కేటీఆర్ పర్యటన.. తంగళ్లపల్లిలో సబ్‌స్టేషన్ ప్రారంభం



సిరిసిల్ల: సిరిసిల్లా జిల్లాలో మంత్రి కేటీఆర్ పర్యటిస్తున్నారు. తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట మండలాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. తంగళ్లపల్లి మండలం చీర్లవంచలో బీఆర్ అంబేద్కర్, చాకలి ఐలమ్మ విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం అదే గ్రామంలో రూ.19.50 లక్షలతో చేపట్టిన ఎస్సీ కమ్యూనిటీ భవన్, రూ.5 లక్షలతో చేపట్టిన ముదిరాజ్ సంఘ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. తర్వాత నూతనంగా నిర్మించిన సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పెద్దమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పలువురి నుంచి వినపత్రాలు స్వీకరించిన మంత్రి కేటీఆర్, యువకులతో కలిసి సెల్ఫీలు దిగారు. లక్ష్మీపూర్‌లో పల్లె దవాఖానను ప్రారంభించిన తర్వాత పాపయ్యపల్లె చేరుకున్నారు. రూ.26 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. గోపాల్‌రావుపల్లె, మండెపల్లిలో అంబేద్కర్ విగ్రహాలను ఆవిష్కరించారు. తంగళ్లపల్లిలోని పీహెచ్‌సీలో ఫిజియోథెరపీ సేవలను ప్రారంచారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 1.30 గంటలకు గండిలచ్చపేటకు చేరుకున్నారు. గ్రామంలో అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహాలను ఆవిష్కరించారు. తర్వాత కేసీఆర్ ప్రగతి ప్రాంగణాన్ని ప్రారంభించారు. దళితబంధు పథకం కింద మంజూరైన పౌల్ట్రీఫాంను ప్రారంభించి లబ్ధిదారులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. మధ్యాహ్నం 2.30 గంటలకు ఎల్లారెడ్డిపేట మండలానికి చేరుకుంన్నారు. మండలంలోని దుమాల గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. తర్వాత చిట్టివాగుపై నిర్మించిన బ్రిడ్జిని ప్రారంభించారు. అనంతరం రూ.10 లక్షలతో నిర్మించిన గౌడ సంఘ భవనం, రూ.10 లక్షలతో మహిళా సంఘ భవనం, చిట్టివాగుపై రూ.4 కోట్లతో నిర్మించిన వంతెన ప్రారంభించారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మల్లన్న పట్నాలకు హాజరయ్యారు అక్కడి నుంచి 3.30 గంటలకు బుగ్గరాజేశ్వర తండా చేరుకొని రూ.20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని, రూ.9.60లతో నిర్మించిన గిరిజన కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించారు. సాయంత్రం 4 గంటలకు రాచర్ల గుండారంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. 5 గంటలకు గంభీరావుపేట మండలం గోరంట్యాలలో అంబేద్కర్ విగ్రహాలను ఆవిష్కరించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు తిరుగు పయనమయ్యారు.




నూతన సచివాలయం సమీపంలో ఏర్పాటు చేసిన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని డీజీపీ అంజనీకుమార్, మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, సీఎస్ శాంతికుమారి తదితరులు సందర్శించారు. ఈ నెల 14న అంబేద్కర్ జయంతి రోజున ఈ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు.




హైదరాబాద్: కేసీఆర్ సర్కార్ అసెంబ్లీలో ఆమోదించి తన వద్దకు పంపిన బిల్లులపై తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఎట్టకేలకు కీలక నిర్ణయం తీసుకున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పంపిన బిల్లుల్లో మూడు బిల్లులకు తెలంగాణ గవర్నర్ తమిళిసై సోమవారం ఆమోద ముద్ర వేశారు. రెండు బిల్లులను గవర్నర్ తమిళిసై ప్రభుత్వానికి తిప్పి పంపారు. మరో రెండు బిల్లులను గవర్నర్ తమిళిసై రాష్ట్రపతికి పంపారు. గవర్నర్ దగ్గర మరో మూడు బిల్లులు పెండింగ్‌లో ఉ న్నాయి. తాము ఎన్నో రకాల ఉద్దేశాలు, లక్ష్యాలతో బిల్లులను ఆమోదించి పంపితే గవర్నర్ ఆమోదించకుండా నెలల తరబడి పెండింగ్‌లో పెడుతున్నారని ప్రభుత్వ వర్గాలు ఆరోపిస్తున్నాయి. అయితే, బిల్లుల్లో స్పష్టత కొరవడిందని, ప్రభుత్వం పూర్తిస్థాయిలో వివరణ ఇవ్వడం లేదని, అందుకే పెండింగ్‌లో పెట్టాల్సి వస్తోందని రాజ్‌భవన్ వర్గాలు ఇన్నాళ్లూ చెప్పుకొచ్చాయి. గత సెప్టెంబరులో జరిగిన శాసన సభ సమావేశాల్లో ప్రభుత్వం ఎనిమిది బిల్లులను ఆమోదించి, అదే నెల 13న గవర్నర్ తమిళిసైకి పంపించింది. వాటిలో జీఎస్టీ బిల్లును మాత్రమే గవర్నర్ ఆమోదించారు. మిగతా ఏడింటిపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ఆ బిల్లుల విషయంలో గవర్నర్ తాజాగా పైన పేర్కొన్న విధంగా నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఇదిలా ఉండగా.. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తీరుపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. అసెంబ్లీలో ఆమోదించి పంపిన బిల్లులకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టారంటూ పిటిషన్ దాఖలు చేసింది. ఇప్పటి వరకూ పది బిల్లులు పెండింగ్‌లో పెట్టారని, గత ఏడాది సెప్టెంబరు నుంచి ఏడు బిల్లులు పెండింగ్‌లో ఉండగా.. బడ్జెట్ సమావేశాల తర్వాత పంపించిన మూడు బిల్లులకు కూడా గవర్నర్ ఆమోదం తెలపలేదని పిటిషన్లో పేర్కొంది. తన పిటిషన్లో ప్రతివాదులుగా గవర్నర్ కార్యదర్శిని చేర్చింది. శాసనసభ ఆమోదించిన అనేక బిల్లులకు ఆమోద ముద్ర వేయకపోవడంతో తరచూ రాజ్యాంగ ప్రతిష్టంభన ఏర్పడుతోందని, అందుకే ఆర్టికల్ 32 కింద సుప్రీం కోర్టు తన న్యాయ పరిధిని ఉపయోగించాలంటూ న్యాయస్థానం తలుపు తట్టక తప్పలేదని పేర్కొంది. ఈ పిటిషన్‌పై సుప్రీం కోర్టు నేడు విచారణ జరపనున్న నేపథ్యంలో గవర్నర్ తమిళిసై పెండింగ్ బిల్లుల ఫైలు బూజు దులపడం గమనార్హం.

## 12న సీఎం కేసీఆర్ ఇఫ్తార్ విందు.. ఏర్పాట్లు పరిశీలించిన మంత్రులు



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం పవిత్రమైన రంజాన్ మాసంలో ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేస్తోన్న సంగతి తెలిసిందే. అలాగే ఈ సంవత్సరం కూడా ఇఫ్తార్ విందుకు ఎల్‌బీ స్టేడియంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి సోమవారం నాడు ఎల్‌బీ స్టేడియంలో ఇఫ్తార్ విందు ఏర్పాట్లపై రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, హెూంమంత్రి మహమూద్ అలీతో కలిసి ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. మత సామరస్యం వెల్లివిరిసే విధంగా రంజాన్ వేడుకలు నిర్వహించడం జరుగుతుందని మంత్రి కొప్పుల ఈశ్వర్ చెప్పారు.

## బిల్లుల పెండింగ్‌పై సుప్రీంలో తెలంగాణ ప్రభుత్వం పిటిషన్.. విచారణ వాయిదా



దిల్లీ: బిల్లులపై నిర్ణయం తీసుకోకుండా పెండింగ్‌లో పెడుతున్నారంటూ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌పై తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేసింది. 2022 సెప్టెంబర్ నుంచి మూడు బిల్లులను గవర్నర్ పెండింగ్‌లో ఉంచారని తెలంగాణ ప్రభుత్వ న్యాయ వాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. గవర్నర్ కొన్ని బిల్లులను ఆమోదించారని.. అందుకు సంబంధించిన వివరాలను సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు సమర్పించారు. ఈ అంశంపై ఈ ఏడాది ఏప్రిల్ 9న గవర్నర్ కార్యాలయం నుంచి ఒక నివేదిక కోర్టుకు అందిందని.. అది సీజేఐ రికార్డు చేసినట్లు చెప్పారు. కొన్ని బిల్లులపై రాష్ట్ర ప్రభుత్వాన్ని గవర్నర్ వివరణ కోరారని.. అదే విషయాన్ని గవర్నర్ కార్యాలయం నివేదికలో పేర్కొన్నట్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లు, అజామాబాద్ పారిశ్రామిక ప్రాంత సవరణ బిల్లుపై వివరణ కోరగా.. న్యాయశాఖ నుంచి ఎలాంటి స్పందన రాలేదని నివేదికలో వెల్లడించారు. వాదనలు విన్న ధర్మాసనం పెండింగ్ బిల్లుల విషయంపై తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.




హైదరాబాద్: మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని భారాస సస్పెండ్ చేసింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ ఇద్దరిపై వేటు వేసింది. భారాస అధినేత, సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం తెలిపింది. కొల్లాపూర్‌కు చెందిన జూపల్లి కృష్ణారావు గతకొంతకాలంగా భారాసపై అసంతృప్తితో ఉన్నారు. స్థానిక ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డితో ఆయనకు విభేదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పలు సందర్భాల్లో బహిరంగంగానే ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వంపై జూపల్లి విమర్శలు చేశారు. కొల్లాపూర్ భారాసలో జూపల్లి వర్గం అసమ్మతి కారణంగా నష్టం జరుగుతోందని ఆ పార్టీ భావించింది. దీంతో గతంలో మంత్రి కేటీఆర్ సైతం ఆయనతో మాట్లాడినా ఫలితం లేకపోయింది. మరోవైపు ఖమ్మం జిల్లాకు చెందిన పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి గతకొంతకాలంగా కేసీఆర్, భారాసపై తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నారు. పార్టీ మారతారని ఇటీవల ప్రచారం జరుగుతున్నా అది కార్యరూపం దాల్చలేదు. కొద్దిరోజులుగా ఆత్మీయ సమావేశాల పేరుతో జిల్లాలోని తన వర్గం నేతలతో ఆయన భేటీ అవుతున్నారు. ఆయా సమావేశాల్లో కేసీఆర్ కుటుంబంపై విమర్శలు చేస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో జూపల్లి, పొంగులేటిని భారాస సస్పెండ్ చేసింది.

## వాళ్లిద్దరూ ఎవరి ఉచ్చులో ఉన్నారో అందరికీ తెలుసు: మంత్రి నిరంజన్‌రెడ్డి



హైదరాబాద్: భారాస అధినేత, సీఎం కేసీఆర్‌ను మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించడం సరికాదని మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. పార్టీకి అతీతులమనే వ్యక్తిగత ధోరణిని ఎవరూ సహించరని చెప్పారు. జూపల్లి, పొంగులేటిని భారాస సస్పెండ్ చేసిన నేపథ్యంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. "ఆ ఇద్దరు నాయకుల ప్రవర్తనను పార్టీ ఇన్నాళ్లూ సహనంతో పరిశీలించింది. చాలాకాలం సంయమనంతో వ్యవహరించింది. పదవులు అనుభవించిన తర్వాత విమర్శలు చేయడం తగదు. ఇద్దరు నాయకులూ అసహనం వెళ్లగక్కుతూ నిందలు మోపారు. కొంతకాలం వేచిచూడాలని కేసీఆర్ చెప్పారు. రాజకీయంగా అవకాశం రాలేదని వాళ్లిద్దరూ దుమ్మెత్తి పోస్తున్నారు. ఇద్దరు నేతలు ఎవరి ఉ చ్చులో ఉన్నారో అందరికీ తెలుసు. పార్టీ అధినేతను బలహీనపరిచే యత్నాలు ఫలించవు" అని నిరంజన్‌రెడ్డి అన్నారు.

## బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయడం సంతోషంగా ఉంది..



హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ నుంచి తనను సస్పెండ్ చేసినందుకు చాలా ఆనందంగా ఉందని జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన ఎమ్మెల్యే క్వార్టర్స్ దగ్గర మీడియాతో మాట్లాడుతూ పంజరంలో నుంచి బయటపడినట్లు ఉ ందన్నారు. దొరలగడీ నుంచి బయటకు వచ్చానని, పార్టీ సభ్యత్వం చేస్తామంటే కూడా పుస్తకాలు ఇవ్వలేదన్నారు. తనను ఎందుకు సస్పెండ్ చేస్తున్నారో సీఎం కేసీఆర్ చెప్పాలన్నారు. తన ప్రశ్నలకు సమాధానం చెప్పి సస్పెండ్ చేయాలన్నారు. బీఆర్ఎస్ బండారం బయటపడుతుందనే తనను సస్పెండ్ చేశారని జూపల్లి కృష్ణారావు అన్నారు. అంతకుముందు ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌కు జూపల్లి కృష్ణారావు వచ్చారు. ఆయనను అసెంబ్లీ భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. స్పీకర్ అనుమతి లేదని చెప్పారు. దీంతో భద్రతా సిబ్బందితో జూపల్లి కృష్ణారావు వాగ్వాదానికి దిగారు. స్పీకర్ ఆదేశాల మేరకే అనుమతి లేదని భద్రతా సిబ్బంది తెలిపారు. కాగా ఖమ్మం రాజకీయం ఆసక్తికరంగా మారుతోంది. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆత్మీయ సమ్మేళనానికి.. పలువురు బీఆర్ఎస్ కీలక నేతలు హాజరవుతారని ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్ అసంతృప్తి నేతలంతా ఏకతాటిపైకి వస్తారని.. ఇప్పటికే జూపల్లి, పొంగులేటి కీలక వ్యాఖ్యలు చేశారు. జూపల్లి వ్యాఖ్యలను బీఆర్ఎస్ అధిష్టానం సీరియస్‌గా తీసుకుంది. ఈ నేపథ్యంలో ఆ ఇద్దరు నేతలకు ముఖ్యమంత్రి కేసీఆర్ షాక్ ఇచ్చారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావును పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. కాగా ఈ ఇద్దరు నేతలు నిన్న అనుచరులతో కలిసి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఇందులో ముఖ్యంగా సీఎం కేసీఆర్, మంత్రి కేసీఆర్ ప్రభుత్వంపై తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. గత ఏడాదిన్నర నుంచి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పార్టీపై ఆగ్రహంతో ఉంటూ వస్తున్నారు. సీఎం కేసీఆర్‌పై బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. అయినప్పటికీ అధిష్టానం ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పైగా ఆయన మద్దతుదారులపై బీఆర్ఎస్ అధిష్టానం వేటు వేసింది. దమ్ముంటే తనపై వేటు వేయాలని ఇప్పటికే పొంగులేటి సవాల్ విసిరారు. ఈ క్రమంలో నిన్నటి ఆత్మీయ సమ్మేళనంలో పొంగులేటి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆయనను సస్పెండ్ చేయాలని బీఆర్ఎస్ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కాసేపటి క్రితమే అధినేత కేసీఆర్ ప్రెస్‌నోట్‌ను విడుదల చేశారు. పార్టీ నుంచి మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందన ఇరువురిని బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు లేఖలో తెలిపారు.

## వైజాగ్ స్టీల్ ప్లాంట్ ఆస్తులను కబ్జా చేసేందుకే బీజేపీ కుట్రలు: ఏపీ బీఆర్ఎస్ అధ్యక్షుడు తోట



విశాఖపట్నం: వైజాగ్ స్టీల్ ప్లాంట్ ఆస్తులను కబ్జా చేసేందుకే బీజేపీ కుట్రలు చేస్తున్నదని ఏపీ బీఆర్ఎస్ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ అన్నారు. ప్రజల ఆస్తులను ప్రైవేటుకు అప్పగించేందుకు కేంద్రం పావులు కదుపుతున్నదని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ పోరాటం ముమ్మరంచేసింది. ఇందులో భాగంగా విశాఖపట్నంలోని కూర్మన్నపాలెం జంక్షన్‌లో స్టీల్ ప్లాంట్ పరిరక్షణ సమితి దీక్షకు ఏపీ బీఆర్ఎస్ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్, రావెల కిశోర్ బాబు, ఇతర నేతలు మద్దులు తెలిపారు. ఉద్యోగ సంఘాలు, కార్మిక సంఘాలు, స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులు, ఉద్యమకారులతో పార్టీ నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తోట చంద్రశేఖర్ మాట్లాడుతూ.. స్టీల్ ప్లాంట్‌ను భావితరాలకు ఇచ్చే బాధ్యత తమదేనని స్పష్టం చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌పై రాజకీయాలను అడ్డుకొని తీరుతామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఒక క్రూరమైన చర్య అని ఆగ్రహం వ్యక్తంచేశారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ నష్టాల్లోకి నెట్టివేయబడిన సంస్థ అని తెలిపారు. ప్లాంటు కార్మికులు కష్టపడి కంపెనీ ఆస్తులను రూ.3 లక్షల కోట్లకు పెంచారన్నారు. విశాఖ ప్లాంటుకు గనుల కేటాయింపు జరగాలని వెల్లడిచారు. నిర్వాసితుల స్థలాలను వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాగా, విశాఖ ఉక్కును కాపాడేందుకు బలమైన నాయకత్వం అవసరమని ఉద్యోగాల సంఘాల నాయకులు తెలిపారు. ప్లాంట్ ప్రైవేటీకరణపై ఏపీ ప్రభుత్వం నోరు మెదపడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. తమ ఆశాదీపం సీఎం కేసీఆరేనని స్పష్టం చేశారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com